RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ Nizamabad | సంపుటి : 03 Vol: 03 | సంచిక : 57 Vol: 57 | మార్చి 14 ఆదివారం 2026 March 14 Sunday 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి Editor : rachamallu madhavi | పేజీలు 08 Pages 08 | వెల : రూ. 6.00 Cost: Rs 6.00 |
|---|---|---|---|---|---|---|

భద్రాద్రి భక్తులకు శుభవార్త ముందస్తు బుకింగ్‌తో సులభంగా దర్శన సేవ

2

## టాంజానియాకు సాంకేతిక సహకారం

- తెలంగాణ వ్యూహాత్మక భాగస్వామ్యం
- సాంకేతిక సహకారానికి మంత్రి శ్రీధర్ బాబు గ్రీన్ సిగ్నల్



హైదరాబాద్ జన సంఘర్షణ

డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న టాంజానియా లక్ష్యానికి సాంకేతిక సహకారం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. శనివారం హైదరాబాద్‌లో టాంజానియా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో భేటీ అయ్యింది.

➤ మిగతా 2వ పేజిలో..

## దేశంలో ఇంధన కొరత లేదు

### ప్రకటించిన కేంద్ర ఇంధన శాఖ



న్యూఢిల్లీ జన సంఘర్షణ

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా దేశంలో ఇంధన కొరత ఏర్పడుతుందనే ప్రచారాన్ని కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువుల మంత్రిత్వ శాఖ కొట్టిపారేసింది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అయితే, ముందస్తు జాగ్రత్తగా ఇంధనాన్ని సీసాలు, డబ్బాలు వంటి విడి పాత్రల్లో నిల్వ చేసుకోవడంపై ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటీవల తమిళనాడులో నిబంధనలకు విరుద్ధంగా లూజ్ కంటైనర్‌లో పెట్రోల్ పోసిన ఒక రిటైల్ అవుట్‌లెట్ లైసెన్స్‌ను

➤ మిగతా 2వ పేజిలో..

## మరింత దిగజారిన బంగారం

వెండి ధరలు: తగ్గుముఖం పట్టిన బులియన్ మార్కెట్



ముంబై జన సంఘర్షణ

అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి ప్రభావం దేశీయంగా బంగారం, వెండి ధరలపై తీవ్రంగా కనిపిస్తోంది. స్టాక్ మార్కెట్లు మరియు రూపాయి విలువలో వస్తున్న మార్పుల నేపథ్యంలో, మదుపర్లు ఆచితూచి అడుగులు వేస్తుండటంతో పసిడి ధరలు భారీగా దిగివచ్చాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,030 రూపాయల మేర తగ్గి 1,59,660 రూపాయల వద్ద కొనసాగుతోంది. అదేవిధంగా, ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర కూడా 950 రూపాయల మేర క్షీణించి 1,46,350 రూపాయలకు చేరుకుంది.

➤ మిగతా 2వ పేజిలో..

## భారత్‌కు రెండు ఎల్పీజీ నౌకలు

హార్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటి ముందుకు



న్యూఢిల్లీ జన సంఘర్షణ

అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతల మధ్య భారత్ మరో కీలక విజయాన్ని సాధించింది. గల్ఫ్ ప్రాంతంలోని హర్మూజ్ జలసంధి వద్ద వందలాది నౌకలు నిలిచిపోయినప్పటికీ, ఇరాన్ సహకారంతో భారత జెండా ఉన్న రెండు ఎల్పీజీ నౌకలు శనివారం ఉదయం సురక్షితంగా ఆ మార్గాన్ని

➤ మిగతా 2వ పేజిలో..

## రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం

- ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ సందర్శన



సిద్దిపేట జన సంఘర్షణ

తెలంగాణలో రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రైతులు లాభదాయకమైన ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మార్చి 22న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు ఆయిల్ పామ్ గెలల ధర టన్నుకు 12 వేల రూపాయలు ఉండగా, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి దానిని 21 వేల రూపాయలకు పైగా పెంచినట్లు తెలిపారు. ఈ పంటకు నీటి ఎద్దడి తక్కువని, మార్కెటింగ్ సమస్యలు లేవని, ప్రతి రైతు ధైర్యంగా ఆయిల్ పామ్ సాగు చేయాలని ఆయన సూచించారు. నర్మెట్టలో సుమారు 300 కోట్ల రూపాయలతో ఫ్యాక్టరీ పనులు పూర్తి చేయడమే కాకుండా, మరో 40 కోట్ల రూపాయలతో

➤ మిగతా 2వ పేజిలో..

## శబరిమల మహిళల ప్రవేశంపై కేరళ ప్రభుత్వం యూ-టర్న్

- 50 ఏళ్ల లోపు వారికి అనుమతి నిరాకరణ



కేరళ జన సంఘర్షణ

శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో పదేళ్ల నుండి 50 ఏళ్ల మధ్య వయసున్న మహిళల ప్రవేశంపై కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో అన్ని వయసుల మహిళలకు ప్రవేశం ఉండాలని పట్టుబట్టిన ప్రభుత్వం, ఇప్పుడు తన నిర్ణయాన్ని మార్చుకుని పాత సంప్రదాయాలనే కొనసాగించాలని నిశ్చయించుకుంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసి, ఆ వివరాలను సుప్రీంకోర్టుకు నివేదించింది. భక్తుల మనోభావాలను గౌరవించడం మరియు తరతరాలుగా వస్తున్న ఆలయ ఆచారాలను

➤ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణలో రోడ్డు ప్రమాదాలు

### వేర్వేరు ఘటనల్లో ఏడుగురు దుర్మరణం

హైదరాబాద్ గరుఢ ధాత్రి

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గత కొన్ని గంటల్లో జరిగిన భీభత్సం కలిగించే రోడ్డు ప్రమాదాలు తీవ్ర విషాదాన్ని నింపాయి. అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్ కారణంగా జరిగిన ఈ వేర్వేరు సంఘటనల్లో మొత్తం ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం రాంపూర్ వద్ద ఆర్టీసీ బస్సు, బైక్ బలంగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో తండ్రీకొడుకులు అమృత్ గౌడ్ (51), రిశివర్ధన్ గౌడ్ (13)లతో పాటు సాయి గౌడ్ (32) అనే వ్యక్తి ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# దేశంలో ఇంధన కొరత లేదు

**మొదటిపేజీ తరువాయి..** కేంద్రం తక్షణమే రద్దు చేసి, సదరు డీలర్‌పై కఠిన చర్యలు తీసుకుంది. భద్రతా మార్గదర్శకాలను ఉల్లంఘించే పెట్రోల్ బంకులపై ఇలాంటి చర్యలే ఉంటాయని అన్ని రాష్ట్రాల డీలర్లకు గట్టి ఆదేశాలు జారీ చేసింది. పెట్రోల్ వంటి మండే స్వభావం ఉన్న ద్రవాలను అసురక్షిత పద్ధతుల్లో నిల్వ చేయడం వల్ల భారీ అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరింది.
మరోవైపు గ్యాస్ సిలిండర్ల సరఫరాపై కూడా ప్రభుత్వం భరోసా ఇచ్చింది. దేశీయ రిఫైనరీలు ఎల్‌పీజీ ఉత్పత్తిని 30 శాతం మేర పెంచాయని, ఇళ్లు, ఆసుపత్రులు మరియు విద్యాసంస్థలకు గ్యాస్ పంపిణీలో ఎటువంటి అంతరాయం ఉండదని అధికారులు వెల్లడించారు. కంగారు పడి అదనపు నిల్వలు చేసుకోవద్దని వినియోగదారులకు సూచించారు. ఇక కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల నిర్వహణ మరియు పర్యవేక్షణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. కీలక రంగాలకు ఇంధన సరఫరాలో ఆటంకాలు కలగకుండా చూడాల్సిన బాధ్యత ఇకపై రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలపై ఆధారపడి ఉంటుంది.

# రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం

**మొదటిపేజీ తరువాయి..** రిఫైనరీ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తుమ్మల వివరించారు. రైతులు పండించిన గెలల వ్యర్థాల నుండి విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రైతులు ఒకే రకమైన పంటలు వేయకుండా పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని, అంతర పంటల సాగుకు కూడా ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగుపై ఉన్న అపోహలను తొలగించి ప్రతి జిల్లాలో ఇలాంటి ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల నుండి తట్టుకునే శక్తి ఆయిల్ పామ్ పంటకు ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్వరలోనే నర్మెట్టలో భారీ రైతు మేళా నిర్వహించి అన్ని జిల్లాల రైతులకు సాగుపై అవగాహన కల్పిస్తామని మంత్రులు వెల్లడించారు.

# శబరిమల మహిళల ప్రవేశంపై కేరళ ప్రభుత్వం యూ-టర్న్

**మొదటిపేజీ తరువాయి..** కాపాడటమే తమ ప్రాధాన్యత అని ప్రభుత్వం కోర్టుకు వివరించింది. అయితే, రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఈ వెనకడుగు వేసిందని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. శబరిమల ఆలయ సంప్రదాయం ప్రకారం 10 నుండి 50 ఏళ్ల మధ్య వయసున్న మహిళలపై ఉన్న నిషేధాన్ని 2018లో ప్రభుత్వం వ్యతిరేకించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో మళ్లీ పాత నిబంధనలకే మొగ్గు చూపడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ అంశంపై వచ్చే నెల 7వ తేదీ నుండి సుప్రీంకోర్టులో తుది వాదనలు జరగనున్నాయి. మరోవైపు, గతంలో మహిళా ప్రవేశానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేసిన భక్తులపై నమోదైన కేసులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ సహా ఇతర ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. కోర్టులో ప్రభుత్వ తాజా అఫిడవిట్ సమర్పించడంతో శబరిమల వివాదం మరోసారి కొత్త మలుపు తిరిగింది.

# భారత్‌కు రెండు ఎల్పీజీ నౌకలు

**మొదటిపేజీ తరువాయి..** దాటాయి. 'శివాలిక్', 'నందాదేవి' పేరు గల ఈ నౌకలు సుమారు 92 వేల టన్నుల వంటగ్యాస్ లోడ్‌తో గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టుల వైపు వస్తున్నాయని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్‌కుమార్ సిన్హా వెల్లడించారు. ఈ నౌకలు మార్చి 16 లేదా 17వ తేదీల్లో భారత్‌కు చేరుకునే అవకాశం ఉందని, నౌకల్లోని భారతీయ సిబ్బంది అంతా క్షేమంగా ఉన్నారని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. గల్ఫ్ ప్రాంతంలో మారుతున్న పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తున్నామని, నావికుల కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని ప్రభుత్వం తెలిపింది.
దేశంలో ఎల్పీజీ కొరత ఏర్పడుతుందనే ఆందోళనల నేపథ్యంలో ఈ పరిణామం పెద్ద ఊరటనిస్తోంది. గృహ వినియోగ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని, ప్రజలు అనవసరంగా ముందస్తు బుకింగ్‌లు చేసి కంగారు పడవద్దని పెట్రోలియం శాఖ అధికారులు సూచించారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బిహార్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో అక్రమ నిల్వలపై ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గృహాలు, ఆసుపత్రులు, హాస్టళ్లకు గ్యాస్ పంపిణీలో మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని, నిబంధనల ప్రకారం సిలిండర్ బుకింగ్‌కు పట్టణాల్లో 25 రోజులు, గ్రామాల్లో 45 రోజుల కనీస గడువు అమల్లో ఉందని అధికారులు స్పష్టం చేశారు.

# మరింత దిగజారిన బంగారం

**మొదటిపేజీ తరువాయి..** కేవలం బంగారం మాత్రమే కాకుండా వెండి ధరలు కూడా భారీ పతనాన్ని మూటగట్టుకున్నాయి. కిలో వెండిపై సుమారు 4,900 రూపాయల వరకు ధర తగ్గడంతో, ప్రస్తుతం హైదరాబాద్‌లో కిలో వెండి ధర 2.8 లక్షల రూపాయలుగా ఉండగా, దేశ రాజధాని ఢిల్లీలో 2.75 లక్షల రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది. అయితే బులియన్ మార్కెట్ ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి కాబట్టి, వినియోగదారులు కొనుగోలు చేసే సమయంలో స్థానిక ధరలను మరోసారి సరిచూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# టాంజానియాకు సాంకేతిక సహకారం

**మొదటిపేజీ తరువాయి..** ఈ సమావేశంలో ఐటీ, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ మరియు పర్యాటక రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని ఇరు పక్షాలు నిర్ణయించాయి. ముఖ్యంగా తెలంగాణలో విజయవంతంగా కొనసాగుతున్న 'మీ సేవ' మోడల్ ద్వారా పౌర సేవలను అందించే విధానంపై టాంజానియాకు మార్గదర్శకత్వం చేయాలని నిర్ణయించారు. అలాగే డిజిటల్ గవర్నెన్స్, స్టార్టప్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధికి అవసరమైన సాంకేతిక మద్దతును అందించడానికి మంత్రి అంగీకరించారు. టాంజానియాలో ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించడంతో పాటు, 'వీ హబ్' (ఔజు ఎబఎ) ద్వారా అక్కడి మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే అంశాలపై కూడా ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. నిరుద్యోగులు మరియు ఉద్యోగుల కోసం స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్ కార్యక్రమాల్లో సహకారం అందించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా టాంజానియా మంత్రి మాట్లాడుతూ, త్వరలోనే తెలంగాణ ప్రభుత్వంతో అధికారికంగా అవగాహన ఒప్పందం (వీశీఖ) కుదుర్చుకుంటామని వెల్లడించారు. ఈ భాగస్వామ్యం రెండు దేశాల మధ్య సాంకేతిక మరియు ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఇరు వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

## పెండింగ్ ప్రాజెక్ట్‌ల కోసం పోరాటం

**మాజీమంత్రి నాగం జనార్ధన్ రెడ్డి**

**నాగర్ కర్నూల్, మార్చి14 :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను పూర్తి చేయకపోతే ప్రాజెక్టు ప్రాంతాల వద్ద పోరాటం చేస్తానని మాజీ మంత్రి డా. నాగం జనార్దన్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల పట్ల అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో పెండింగ్‌లో ఉన్న 3 కిలోమీటర్ల పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు తాగునీరు, సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే వయస్సును లెక్కచేయకుండా పోరాటాలు చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేయించేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో విద్యుత్ సమస్యలు ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. ఎత్తిపోతల పథకంలో ఐదు మోటర్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని , రైతులు పండించిన మొక్కజొన్న పంటను ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాల కోసం కాదు, రైతుల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నానని స్పష్టం చేశారు.

## తమిళనాడులో కాలేజీ బస్సును ఢీకొన్న గూడ్స్

**ఆరుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు**

**చెన్నై, మార్చి14 :** తమిళనాడు రాజధాని చెన్నై కరూర్‌లో రైలు ప్రమాదం జరిగింది. శనివారం సాయంత్రం ఒక గూడ్స్ రైలు ప్రైవేట్ కాలేజీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ ఆరుగురు విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉండగా.. 18 మందికి తీవ్రంగా గాయాలయ్యాయి. కరూర్‌లోని వెల్లియనాయ్ సమీపంలో ప్రైవేట్ బస్సును వేగంగా వస్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టింది. బస్సును డ్రైవర్ రైల్వే ట్రాక్‌ను దాటిస్తుండగా.. రైలు ఢీకొట్టడంతో బస్సు నుజ్జునుజ్జు అయింది. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు, విపత్తు నిర్వహణ దళాలు సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన విద్యార్థులను కరూర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండగా.. ఒకరిని ఐసీయూలో ఉంచినట్టు సమాచారం. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# శరవేగంగా విశాఖ-భోగాపురం ఎయిర్‌పోర్టు రోడ్డు

**విశాఖ పర్యటనలో మంత్రి నారాయణ వెల్లడి**

**విశాఖపట్నం, మార్చి14 :** విశాఖ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు రోడ్లు నిర్మిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఇప్పటికే 54 శాతం రోడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా పూర్తవుతున్నాయని అన్నారు. భూ యజమానులతో మాట్లాడి ఎవరికీ అన్యాయం జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. విశాఖ నగరంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్‌తో కలిసి మంత్రి నారాయణ పర్యటించారు. సీతమ్మధారలోని మురికివాడను పరిశీలించారు. అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. భోగాపురం విమానాశ్రయాన్ని కలిపే మాస్టర్‌ప్లాన్ రోడ్లు, నేరెళ్లవలస నుంచి కొత్తవలస, బోయపాలెం, కాపులుప్పాడ రోడ్డు, భీమిలి నుంచి దొరతోట జంక్షన్‌కు వెళ్లే రోడ్డును పరిశీలించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభం నాటికి మాస్టర్ ఎ÷-లాన్ రోడ్లు పూర్తి చేస్తామని నారాయణ అన్నారు. ' సీతమ్మధార ప్రైవేట్ స్థలంలోని మురికివాడ వాసులను ఆదుకుంటాం. సుమారు 200 కుటుంబాలు ఇళ్లు, షెడ్లు వేసుకొని ఉంటున్నాయి. సీతమ్మధార ఏఎస్ఆర్ నగర్‌లోని మురికివాడను ఆధునికీకరిస్తాం' అని మంత్రి నారాయణ తెలిపారు.

## ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభం

**రాజంపేట, మార్చి14 :** ప్రజలకు సురక్షితమైన, మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాజంపేట నియోజకవర్గం తెదేపా బాధ్యుడు చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. ఒంటిమిట్టలో శనివారం దర్జిపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సేవలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు కూడా ఆర్టీసీ సేవలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రజలకు, విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ ప్రయాణికులకు ఇక నుంచి రవాణా కష్టాలు తగ్గుతాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతకుముందు కొత్తపల్లె, దర్జిపల్లె గొల్లపల్లె, పెన్నపేరూరు, నరసన్న గారి పల్లె గ్రామ ప్రజలు నూతన బస్సు సౌకర్యాన్ని కల్పించినందుకు కూటమి ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## వీసా గడువు ముగిసినా నగరంలోనే తిష్ట

**నైజీరియన్‌ను గుర్తించి తిప్పిపంపిన పోలీసులు**

**హైదరాబాద్, మార్చి14 :** నగరంలోని కొండాపూర్ ప్రాంతంలో అక్రమంగా నివాసం ఉంటున్న నైజీరియన్ జాతీయుడిని ఈగల్ టీమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యక్తిని విక్టరీ పుయామగన్ (34) అలియాస్ కెన్నీగా గుర్తించిన అధికారులు ఎనిమిదేళ్లుగా భారతదేశంలో ఎటువంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా నివసిస్తున్నట్లు నిర్ధారించారు. నిందితుడిని అనుమతులతో స్వదేశానికి డిపోర్ట్ చేశారు. పోలీసుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. విక్టరీ అపుయామగన్ 2018లో ఘనా నకిలీ పాస్ట్‌పోర్ట్ సాయంతో భారత్‌లోకి ప్రవేశించాడు. మెడికల్ అటెండెంట్ వీసాపై తొలుత ఢిల్లీకి చేరుకున్న కెన్నీ.. ఆ తర్వాత పంజాబ్‌కు వెళ్లి అక్కడ కొంత కాలం జిమ్ ట్రైనర్‌గా పనిచేశాడు. అయితే, తన వీసా గడువు ముగిసినప్పటికీ అధికారులకు దొరక్కుండా అక్రమంగా దేశంలో ఉండిపోయాడు. 2025లో సినిమాల్లో నటించాలనే కోరికతో హైదరాబాద్ కు చేరుకున్న కెన్నీ.. ఇక్కడ జూనియర్ ఆర్టిస్ట్‌గా ప్రయత్నాలు మొదలుపెట్టాడు. తన శారీరక దారుఢ్యంతో ఇప్పటివరకూ సుమారు 5 సినిమాల్లో చిన్న పాత్రలు దక్కించుకున్నాడు. ఇటీవల విడుదలైన హిందీ మూవీ 'టస్కరి'లో నటించిన కెన్నీ ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తెలుగు మూవీ 'వారణాసి'లోనూ నటిస్తున్నాడు. వీసా గడువు ముగిసినా, నకిలీ పత్రాలతో చలామని అవుతున్నాడన్న పక్కా సమాచారంతో ఈగల్ టీమ్ కొండాపూర్‌లో నిఘా పెట్టి అతడిని అదుపులోకి తీసుకుంది. సరైన అనుమతి పత్రాలు లేకపోవడం, నకిలీ పాస్‌పోర్ట్ వినియోగించినందుకు గాను అతడిని అరెస్ట్ చేసి నిబంధనల ప్రకారం స్వదేశానికి పంపించివేశారు.

## నిడదవోలులో పలు అభివృద్ధి కార్యక్రమాలు: మంత్రి

**కాకినాడ, మార్చి14** తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. పట్టణంలో రూ.90.41 లక్షల నిధులతో 6, 13, 16, 23వ వార్డుల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దుర్గేశ్ మాట్లాడుతూ పట్టణాన్ని ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసం కారణంగా ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల అమలుతోపాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కృష్ణవేణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఇంటికే భద్రాద్రి కళ్యాణ తలంబ్రాలు

**ముందస్తు బుకింగ్‌తో అధికారుల ఏర్పాట్లు**

**అన్‌లైన్ బుకింగ్ ద్వారా అందుబాటులో సేవలు**

**భద్రాచలం, మార్చి14 :** తెలుగు రాష్ట్రాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగలలో శ్రీరామనవమి ప్రధానమైనది. 'దక్షిణ అయోధ్య'గా ప్రసిద్ధి చెందిన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించే కళ్యాణ బ్రహ్మోత్సవాలకు ఒక ప్రత్యేకత ఉంది. ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ నవమి రోజున నిర్వహించే ఈ వార్షిక కళ్యాణ వేడుకను కళ్లారా వీక్షించేందుకు దేశ విదేశాల నుండి లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. రామదాసు కీర్తనలతో మార్మోగే భద్రాద్రి గిరులు, గోదావరి నది తీరాన జరిగే ఈ అద్భుత ఘట్టం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. ఈ ఏడాది మార్చి 19న ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 2 వరకు వైభవంగా సాగనున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా ఈసారి కళ్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించాలనుకునే భక్తుల కోసం టికెట్ బుకింగ్ , రాలేని భక్తుల కోసం ఇంటికే తలంబ్రాలను పంపే వినూత్న ఏర్పాట్లు కూడా సిద్ధమయ్యాయి. ఈ మహోత్సవంలో అత్యంత ముఖ్యమైన శ్రీ సీతారాముల వార్షిక కళ్యాణం మార్చి 27న జరగనుండగా, మరుసటి రోజు అనగా మార్చి 28న శ్రీరాముడి పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించబడుతుంది. భక్తులు ఈ పవిత్ర కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించడానికి ఆలయ అధికారులు ప్రత్యేక సెక్టార్లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం భక్తులు భద్రాచలం దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు. వెబ్‌సైట్ హోమ్ పేజీలోని 'శ్రీరామనవమి టికెట్' లింక్‌పై క్లిక్ చేసి, తమకు నచ్చిన కళ్యాణం లేదా పట్టాభిషేకం సెక్టార్‌ను ఎంచుకుని నిర్ణయించిన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ సదుపాయం లేని వారు మార్చి 15 నుంచి భద్రాచలం రామాలయ ప్రధాన కౌంటర్, తానీషా కళ్యాణ మండపం, గోదావరి బ్రిడ్జి వద్ద ఉన్న దేవస్థానం విచారణ విభాగం లేదా భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం ద్వారా నేరుగా టికెట్లు పొందవచ్చు. దూర ప్రాంతాల్లో ఉండి భద్రాచలానికి రాలేని భక్తుల కోసం కూడా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ. 5,000 లేదా రూ. 1,116 టికెట్లు బుక్ చేసుకుంటే, వారి గోత్ర నామాలతో ఆలయంలో కళ్యాణం నిర్వహిస్తారు. అంతేకాకుండా, స్వామివారి ముత్యాల తలంబ్రాలను భక్తుల ఇళ్లకే చేర్చేందుకు ÷ఉ÷ూఖిఅ లాజిస్టిక్స్ విభాగం ప్రత్యేక సేవలను అందిస్తోంది. రూ. 151 చెల్లించి సమీప ఆర్టీసీ కౌంటర్లలో లేదా ఆన్‌లైన్ ద్వారా తలంబ్రాలను బుక్ చేసుకుంటే, ఉత్సవాల అనంతరం వాటిని ఇంటికే డెలివరీ చేస్తారు. ఈ ఏడాది సుమారు 5

# హైదరాబాద్‌కు గర్వకారణం..

**❑ విజన్ ఐఏఎస్ సెమినార్‌లో ఆశావహులకు స్ఫూర్తిని కల్పించిన యుపిఎస్సి టాపర్లు ఎస్. వర్షిత్ రెడ్డి (ఆల్ ఇండియా ర్యాంక్ 259), విజయసింహ రెడ్డి (ఆల్ ఇండియా ర్యాంక్ 682)**

హైదరాబాద్ సిటీబ్యూరో/ మార్చి 14(జనసంఘర్షణ )

విజన్ ఐఏఎస్ నేడు ఒక స్ఫూర్తిదాయకమైన సెమినార్‌ను తమ ప్రాంగణంలో నిర్వహించింది. యుపిఎస్సి పరీక్షలలో విజయవంతమైన అభ్యర్థులు తమ ప్రయాణాలు, వ్యూహాలను పంచుకోవడానికి ఒకచోట చేర్చింది. వీరిలో యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ పరీక్ష 2025లో వరుసగా ఆలిండియా ర్యాంక్ 259 మరియు 682 సాధించిన ఎస్. వర్షిత్ రెడ్డి, విజయసింహ రెడ్డి సైతం ఉన్నారు. తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన ఎస్. వర్షిత్ రెడ్డి, బిట్స్ పిలాని, హైదరాబాద్ క్యాంపస్ (2023) నుండి ఇంజినీరింగ్ పట్టభద్రుడయ్యాడు. తన యుపిఎస్సి ప్రయాణానికి ముందు, అతను ఎట్రోపీ మరియు పోర్టర్ వంటి ప్రముఖ టెక్ సంస్థలతో కలిసి పనిచేస్తూ 2 సంవత్సరాల వృత్తిపరమైన అనుభవాన్ని పొందాడు. ప్రస్తుతం ఆయన విజయవాడలోని డిజిజిఐలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. విజయ సింహా రెడ్డి, శ్రీ నీధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నుండి కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్‌లో బి. టెక్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆయన స్టేట్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణులై ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణ పొందుతున్నారు. ఎస్. వర్షిత్ రెడ్డి తన ఐచ్ఛిక సబ్జెక్టుగా ఆర్థిక శాస్త్రాన్ని ఎంచుకున్నారు, అయితే సోషియాలజీని విజయ సింహా రెడ్డికి ఐచ్ఛిక అంశంగా తీసుకున్నారు. వారి విజయం వారి అచంచలమైన అంకితభావం, వ్యూహాత్మక సంసిద్ధత, ప్రజా సేవ పట్ల లోతైన నిబద్ధతకు నిదర్శనం. సెమినార్‌లో మాట్లాడుతూ, వారు తమ ప్రయత్న ప్రయాణంలో స్థిరత్వం, స్వీయ-క్రమశిక్షణ యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమానికి విజన్ ఐఏఎస్ సౌత్ రీజియన్ బ్రాంచ్ హెడ్ హరేకృష్ణ సింగ్ అధ్యక్షత వహించారు. భవిష్యత్ ఆశావహులకు రోల్ మోడల్‌గా ఉన్నందుకు ఎస్.వర్షిత్ రెడ్డి ,విజయ సింహా రెడ్డి లను ఆయన ప్రశంసించారు. "ఎస్. వర్షిత్ రెడ్డి, విజయ సింహా రెడ్డి సాధించిన విజయాల పట్ల మేము గర్వపడుతున్నాము. వారి ప్రయాణం ఆశావహులైన సివిల్ సర్వెంట్లకు ప్రేరణనిస్తుంది" అని శ్రీ సింగ్ అన్నారు.




# జాతిని ఏకం చేసిన గీతం వందేమాతరం...

**❑ డా. ఆచార్య ఫణీంద్ర**

హైదరాబాద్ సిటీబ్యూరో మార్చి 14(జనసంఘర్షణ )

భారత స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతర గీతం నిర్వహించిన పాత్ర అనిర్వచనీయమైనదని, భారత జాతిని ఏకం చేసిన గీతమని యువ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ హైదరాబాద్ అధ్యక్షులు డాక్టర్ ఆచార్య ఫణీంద్ర అన్నారు. త్యాగరాయ గాన సభ హైదరాబాద్, భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 14 రెండవ శనివారం రోజున కళా సంగీత నాట్య వేదిక త్యాగరాయ గాన సభలో జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరై కవి, రచయిత విమర్శకులు శతాధిక గ్రంథ ప్రచురణ కర్త వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన వందేమాతరం కవితా సంకలనం మరియు నాకు నచ్చిన పుస్తకం వ్యాస సంకలనాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ కవులను ప్రోత్సహిస్తూ శతాధిక గ్రంథాలను వెలువరించిన వైరాగ్యం ప్రభాకర్ అభినందనీయులని అన్నారు. ముప్పై మంది తెలంగాణాకు సంబంధించిన ప్రముఖ కవులు రాసిన పుస్తకాలపై సమగ్రమైన విశ్లేషణ చేస్తూ 30 మంది రచయితలు అందించిన వ్యాస సంకలనం నాకు నచ్చిన పుస్తకం సాహిత్యం పట్ల అనురక్తిని ఆసక్తిని కలగజేస్తుందని, ఒకే చోట 30 మంది కవులు రాసిన పుస్తకాలను చదివే అవకాశం లభిస్తుందని ఇలాంటి పుస్తకాలను వైరాగ్యం ప్రభాకర్ మరిన్ని వెలువరించాలని కోరారు. విశిష్ట అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది అవార్డు గ్రహీత, షార్ట్ ఫిలిం సొసైటీ టి.ఎస్ కార్యదర్శి సాదనాల వెంకటస్వామి నాయుడు మాట్లాడుతూ నేడు వందేమాతర గీతాన్ని పూర్తిగా చదవాల్సిన అవసరం ఉందని అన్నారు. కవులు తమ రచనలను ఒకటికి రెండు మార్లు చూసుకొని అక్షర దోషాలు లేకుండా జాగ్రత్త పడాలని అన్నారు. నాకు నచ్చిన పుస్తకం వ్యాస సంకలనాన్ని కాకతీయ ప్రభుత్వ కళాశాల హనుమకొండ అసోసియేట్ ప్రొఫెసర్ డా. జరుపుల రమేష్ వందేమాతరం కవితా సంకలనాన్ని ఆధ్యాత్మికవేత్త ప్రవచనకర్త చౌదూరి కళాపీఠం అధ్యక్షులు చౌదూరి నరసింహారావు సమీక్ష చేసిన సభలో ఇరు తెలుగు రాష్ట్రాల కవులతో కవి సమ్మేళనం నిర్వహించడం జరిగింది. సభలో పాల్గొన్న కవులను భవానీ సాహిత్య వేదిక సర్టిఫికెట్ మరియు శాలువాతో ఘనంగా సత్కరించింది.



# దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఎల్పిజీ సంక్షోభంపై ఎన్ఎస్‌యూఐ నిరసన

**❑ ఎన్ఎస్‌యూఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్**

14.. మార్చి... జన సంఘర్షణ ప్రతినిధి

దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఎల్పిజీ గ్యాస్ సంక్షోభం కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎన్ఎస్‌యూఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గ్యాస్ సిలిండర్ల కొరతతో పాటు ధరలు భారీగా పెరగడం వల్ల హాస్టల్లోని మెస్సులు, పీజీ వసతగృహాలు విద్యార్థులకు సమయానికి భోజనం అందించలేని పరిస్థితి నెలకొన్నట్టు తెలిపారు. ఈ సమస్య కరుణంగా వేలది మంది విద్యార్థులు రోజువారి జీవితంలో అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పట్టణాల్లో చదువుకుంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఈ పరిస్థితి వల్ల మరింత ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హాస్టల్ మెస్సులు గ్యాస్ సిలిండర్‌ల కొరత కారణంగా సక్రమంగా నిర్వహించలేకపోవడం వల్ల విద్యార్థులు సరైన సమయంలో భోజనం పొందలేకపోతున్నారని ఆయన తెలిపారు. ఇది విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం బిజెపి ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలేనని ఆయన విమర్శించారు. గ్యాస్ ధరలను నియంత్రించడంలో విఫలమవడంతో పాటు సరఫరా వ్యవస్థను సక్రమంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం దురదృష్టకరమని అన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అజ్మీర సురేష్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల భోజన వసతులు సక్రమంగా కొనసాగేందుకు హాస్టల్ మెస్సులకు తగినంత గ్యాస్ సిలిండర్ లను తక్షణమే అందించాలని, అలాగే పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించాలని, కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత పెద్ద స్థాయిలో ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఎన్ఎస్‌యూఐ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని, విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం ఉద్యమాలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు ఉర్సు శివ, షేక్ నయీమ్, భూక్య శ్రీధర్, షేక్ షాను, రాచకొండ సాయి, సమీర్, నిఖిల్, అమ్ము, సందీప్, తదితరులు పాల్గొన్నారు.







## వినాయకపురం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులకి గమనిక...

అశ్వరావుపేట : మార్చి 13 జన సంఘర్షణ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలంలో 33/11 కెవి వినాయకపురం సబ్ స్టేషన్ లో గల పవర్ ట్రాన్స్ఫార్మర్ కెపాసిటీ 3.15 యంవిఏ నుంచి 5 యంవిఎ కు మారుస్తున్నందున నేడు ఆదివారం రోజున ఉదయం 7 గం నుంచి మధ్యాహ్నం 2:00 గంటలవరకు వినాయకపురం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయము కలుగును కావున వినియోగదారులందరు సహకరించవలసిందిగా కోరుచున్నాము.

# పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు

**❑ మండల పశు వైద్యులు....డాక్టర్ సురేష్ కుమార్**

కోటగిరి/ పోతంగల్ మార్చి 14 జన సంఘర్షణ

కోటగిరి మండలం ఎత్తొండ క్యాంపులో ఆవు, గేదె, జాతి 3 నెలలపై వయసు గల పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధినిరోధక టీకాల పంపిణీ స్థానిక సర్పంచ్ వీరమని చేతుల మీదుగా ప్రారంభించారు., పశువులకు టీకాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యులు సురేష్ కుమార్, సిబ్బంది సుధీర్ గౌడ్, అటెండర్లు లక్ష్మీ, భూమేష్, భాస్కర్, సతీష్ పశుమిత్ర రాజేశ్ నాయకులు అర్జున్, పశు పెంపకందార్లు తదితరులు పాల్గొన్నారు.



# జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




14. మార్చి... జనసంఘర్షణ :

జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ సింగరేణి మండలం లింగం బంజర గ్రామంలో జెండా ఆవిష్కరణ బడుగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇల్లందు నియోజకవర్గ పీసీసీ ఆంగోత్ శ్రీను రావడం జరిగింది. మద్ది సాయికుమార్, ముత్యాల వీర బ్రహ్మ, హేమంత్, ఖాయం శాంతి కుమార్, రామ్ రాజ్, మొగిలిచర్ల రాంబాబు, గుమ్మడి రవి, సీహెచ్. సిద్ధార్థ్, పి.హేమంత్ కుమార్, బానోత్ గోపీనాథ్, బి. స్టాలిన్, దాసు తదితరులు జనసైనికులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది జై జనసేన.

# ప్రభుత్వం ఆశవర్కర్ల డిమాండ్‌లు నెరవేర్చాలి

**❑ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**

భైంసా, మార్చి 14 (జన సంఘర్షణ)

రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల డిమాండ్ల నెరవేర్చాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి రావాలని ఆశ వర్కర్లు శనివారం అయన నివాసంలో వినతిపత్రం అందించిన సందర్భంగా మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో ఆశ వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నెలకు 18 వేల రూపాయల వేతనం ఇవ్వాలన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశంలో బిజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి, లేదా తాను ఆశ వర్కర్ల తరఫున మాట్లాడనున్నట్లు చెప్పారు.. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వెట్టి చాకిరి చేయించుకుంటుందన్నారు. డిమాండ్లను నెరవేర్చకపోతే ఆందోళన పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు. ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించిన వారి లో సంఘ నాయకులతోపాటు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుండి పెద్ద మొత్తంలో ఆశ వర్కర్లు ఎమ్మెల్యే నివాసానికి తరలివచ్చారు.



# విగ్రహ ప్రతిష్టపన మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

కుబీర్, మార్చి 14 (జన సంఘర్షణ)

నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన ముధోల్ మాజీ శాసన సభ్యులు జీ.విఠల్ రెడ్డి. రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు కూడ ఏప్రిల్ నెలలో మంజూరు అయితవి అని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినందుకు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గృహ నిర్మాణ శాఖ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రిజూపల్లి కృష్ణారావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన ముధోల్ మాజీ శాసనసభ్యులు జీ. విట్టల్ రెడ్డి. వారి వెంట మాజీ జడ్పీటీసీ శంకర్ చౌహన్, స్థానిక సర్పంచ్ సావిత్రబాయి, రాజురా సర్పంచ్ అగ్గు మారుతీ, మల్లేష్, ధార్ కుబీర్ మాజీ సర్పంచ్ బంక ఆనంద్, మాజీ సర్పంచ్ లు హందు, శివలాల్ నాయక్, గంగాధర్, రాజు, బాలు, గ్రామస్థులు ఉన్నారు.



# వ్యాక్సిన్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది

**❑ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కామారెడ్డి..**

మార్చ్ 14( జన సంఘర్షణ)

కామారెడ్డి జిల్లాలో బాలికల ఆరోగ్య రక్షణ కోసం హ్యూం (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ వ్యాక్సిన్ ప్రస్తుతం బాన్సువాడ ఆసుపత్రి, కామారెడ్డి ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ఉచితంగా ఇవ్వబడుతోంది. గర్భాశయ క్యాన్సర్ మహిళల్లో గర్భాశయపు దిగువ భాగం అయిన సర్విక్స్‌ను ప్రభావితం చేసే తీవ్రమైన వ్యాధి. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనల ప్రకారం సుమారు 99.7% గర్భాశయ క్యాన్సర్ కేసులు హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వల్లే సంభవిస్తాయి. సాధారణంగా ఈ వైరస్ ఇన్ఫెక్షన్ చాలా సందర్భాల్లో స్వయంగా తగ్గిపోతుంది. అయితే కొన్ని సందర్భాల్లో అధిక ప్రమాదకరమైన హెచ్‌పీవీ రకాల ఇన్ఫెక్షన్ కొనసాగితే కాలక్రమేణా క్యాన్సర్‌కు దారితీసే అవకాశం ఉంది.భారతదేశంలో మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ రెండవ అత్యంత సాధారణ క్యాన్సర్ గా గుర్తించబడింది. 2022 సంవత్సరంలో దేశవ్యాప్తంగా సుమారు 79,103 కొత్త కేసులు, 34,805 మరణాలు నమోదయ్యాయి. ఇందులో ఎక్కువ శాతం కేసులు హెచ్‌పీవీ టైప్-16, టైప్-18 వల్ల సంభవిస్తాయి.

ఈ రెండు రకాల వైరస్‌లను లక్ష్యంగా చేసుకొని గార్డాసిల్(క్వాడ్రివాలెంట్) హెచ్‌పీవీ వ్యాక్సిన్ తయారు చేయబడింది. ఈ వ్యాక్సిన్ ఒక సురక్షితమైన నాన్-లైవ్ రీకాంబినెంట్ వ్యాక్సిన్. ఇది శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి వైరస్‌పై యాంటీబాడీలు తయారయ్యేలా చేస్తుంది. భవిష్యత్తులో వైరస్‌కు గురైనా ఈ యాంటీబాడీలు వైరస్ కణాల్లోకి ప్రవేశించకుండా అడ్డుకొని క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఈ వ్యాక్సిన్ 14 సంవత్సరాలు పూర్తయి 15 సంవత్సరాలు నిండని బాలికలకు ఇవ్వడం అత్యంత ప్రభావవంతంగా ఉంటుంది. చిన్న వయసులో వ్యాక్సిన్ తీసుకున్నప్పుడు శరీరంలో రోగనిరోధక ప్రతిస్పందన ఎక్కువగా ఏర్పడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 2006 సంవత్సరం నుండి ఇప్పటివరకు 50 కోట్లకు పైగా డోసులు ఇవ్వబడ్డాయి. అంతర్జాతీయ ఆరోగ్య సంస్థల పర్యవేక్షణలో ఇది పూర్తిగా సురక్షితమని నిర్ధారించబడింది. సాధారణంగా స్వల్పమైన నొప్పి లేదా ఎర్రబడటం వంటి చిన్నపాటి ప్రభావాలు మాత్రమే కనిపించవచ్చు. భారత ప్రభుత్వం తాజా శాస్త్రీయ ఆధారాల మేరకు ఒక్క డోసు (0.5 ఎంఎల్) షెడ్యూల్‌ను అమలు చేస్తోంది. ఒకే డోసు కూడా దీర్ఘకాలిక రక్షణను అందిస్తుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. మొదటి మూడు నెలల పాటు ఈ వ్యాక్సిన్ గుర్తించిన ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ప్రతిరోజూ అందుబాటులో ఉంటుంది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేల రూపాయలు ఖర్చు అయ్యే ఈ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. టీకా వివరాలు యు-విన్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ లో నమోదు చేయబడతాయి, దీని ద్వారా తల్లిదండ్రులు టీకా సర్టిఫికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. టీకా వేయించేటప్పుడు ఆధార్ వంటి ఐడి ప్రూఫ్, మొబైల్ నంబర్ (ఓటీపీ కోసం) మరియు తల్లిదండ్రుల సమ్మతి పత్రం అవసరం ఉంటుంది.

**కానీ కొన్ని పరిస్థితుల్లో టీకా వాయిదా వేయాలి:**

1 గతంలో ఏనీ వ్యాక్సిన్‌కు తీవ్రమైన అలెర్జీ వచ్చినట్లయితే

2.ఆ రోజు తీవ్రమైన జ్వరం లేదా తీవ్రమైన అనారోగ్యం ఉన్నట్లయితే

3.ఇప్పటికే ప్రైవేట్‌లో పూర్తి హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకున్నట్లయితే


జిల్లాలోని తల్లిదండ్రులు తమ 14 సంవత్సరాల బాలికలను సమీపంలోని బాన్సువాడ ఎంసీహెచ్ లేదా కామారెడ్డి జీజీహెచ్ ఆసుపత్రులకు తీసుకువచ్చి ఉచితంగా హెచ్‌పీవీ టీకా వేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విజ్ఞప్తి చేస్తోంది. ఈ టీకా ద్వారా భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్‌ను నివారించవచ్చు.

# సోదరభావం, శాంతి, సహనానికి రంజాన్ ప్రతీక

**❑ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి**

ఎడపల్లి, మార్చ్ :14 (జన సంఘర్షణ)

ఎడపల్లి మండలంలో రంజాన్ పండుగ సందర్భంగా మైనార్టీ సోదరులకు రంజాన్ కానుకల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామంలోని ఎస్కే ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి బోధన్ శాసనసభ్యులు మరియు ప్రభుత్వ ముఖ్య సలహాదారు సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... రంజాన్ పండుగ పరస్పర సోదరభావం, శాంతి, సహనానికి ప్రతీక అని అన్నారు. సమాజంలో అందరూ కలిసి ఐక్యంగా జీవించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం మైనార్టీ సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముస్లిం సోదరులు ఆనందంగా రంజాన్ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు."రంజాన్ పవిత్రమైన పండుగ. ఈ పండుగ ద్వారా సోదరభావం, ఐక్యత పెరుగుతుంది. మైనార్టీ సోదరుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. అందరూ శాంతి, సౌభ్రాతృత్వంతో పండుగను జరుపుకోవాలి" అని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. అనంతరం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మైనార్టీ సోదరులకు, మహిళలకు రంజాన్ తోఫాలను అందజేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై కానుకలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు తాహిర్ బిన్ హుందాన్, మనాల మోహన్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తహసీల్దార్ దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.





# ఎడ్లబండ్ల ప్రదర్శనకు పోలీసు బందోబస్తు కల్పించాలని ఎస్సైకి వినతిపత్రం


**❑ మూడు గ్రామాల సర్పంచులు**

లింగంపేట్:మార్చ్ 14 (జనసంఘర్షణ)




లింగంపేట మండలంలోని అయ్యపల్లి ప్రభు స్వామి ఆలయం వద్ద ఆదివారం నిర్వహించే జాతర కార్యక్రమానికి పోలీసు బందోబస్తు ఇవ్వాలని ఎస్సై దీపక్ కుమార్ మూడు గ్రామాల సర్పంచులు ఉపసర్పంచూలు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం ఆలయం వద్ద ప్రతి ఏడు నిర్వహించే జాతరలో మూడు గ్రామాలు శెట్పల్లి, అయ్యపల్లి, అయ్యపల్లి తాండ గ్రామాలకు చెందిన ఎడ్ల బండ్ల ప్రదర్శన ఉంటుందన్నారు. ఎడ్లబండ్ల సీరియల్లో ప్రతిసారి గొడవలు జరిగి జాతరకు విచ్చేసే భక్తులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా, జాతరలో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు భద్రత కల్పించాలని ఎస్సైకి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి సర్పంచ్ అట్టెం శ్రీనివాస్, అయ్యపల్లి తండా మార్కెట్ కమిటీ డైరెక్టర్. ఫుల్ సింగ్, గోపాల్, ఉప సర్పంచ్ మన్నే బాలయ్య. తాండ ఉపసర్పంచ్ రమేష్, శంకరప్ప, చల్ల మల్లయ్య, రాములు, వెంకయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రజాసేవకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిరంతరం కృషి



రామకుప్పం మార్చి 14 (జనసంఘర్షణ)

రాష్ట్ర డిప్యూటీ సీఎం జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సినిమాల్లోని సంపాదన కన్నా రాష్ట్రంలో ప్రజల సంక్షేమమే మిన్నగా భావించి నట్లు రామకుప్పం మండల జనసేన పార్టీ అధ్యక్షులు హరీష్ కుమార్ పేర్కొన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శనివారం స్థానిక వైయస్సార్ సర్కిల్ నందు జనసేన పార్టీ జెండాను కూటమినేతలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పేదల సంక్షేమం కోసం డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషిని కొనియాడారు. పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వంతో కలిసి రాష్ట్రాన్ని ప్రగతి వైపు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని రానున్న రోజుల్లో పార్టీ అభివృద్ధితోపాటు ప్రజల సంక్షేమం కోసం మరింత కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కూటమినేతలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటరమణ, కార్యదర్శి కామ్రాజు నాయక్ మాజీ అధ్యక్షులు ఆనంద్ రెడ్డి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు నరసింహులు, జనసేన పార్టీ నేతలు పవన్ , శ్రీకాంత్, భాస్కర్, గంగాధర్, వినోద్, చరణ్, గజేంద్ర, ఆన్ జపాన్ సురేష్, బీజేపీ నేతలు ఆంజనేయులు, రాజసింహ తదితరులు పాల్గొన్నారు.

## అశ్వరావుపేట డ్రైవర్ కాలనీలో పెళ్లి కారు బోల్తా



**❑ పెళ్లికూతురుకి గాయాలు**

14.. మార్చి.. జన సంఘర్షణ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలో డ్రైవర్ కాలనీలో తిరుపతి నుంచి వస్తున్న కారు హఠాత్తుగా రోడ్డు మధ్యలో పల్టీ కొట్టడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డ పెళ్లి దంపతులు. పెళ్లికూతురికి మాత్రం తలకి బలమైన గాయపడినట్టు సమాచారం తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వస్తున్న పెళ్లికూతురు పెళ్లి కొడుకు వాహనం అశ్వరావుపేట ఎంట్రన్స్ లో డ్రైవర్ కాలనీలో సడన్గా టైగర్ కళ్ళు మూసి తెరిచేలోగా కారు బోల్తా పడి పెద్ద కూతురికి బలమైన గాయాలవడం సమాచారం. వాళ్ళని గ్రామస్తులు హఠాత్తుగా వచ్చి బయటికి తీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం ఏం జరిగింది ఎలా ఉన్నారు అన్నది తెలియాల్సి ఉంది.

## పాత కమలాపురం సర్పంచ్ తేజావత్ బాబురావు కుటుంబాన్ని పరామర్శించిన రైతు కమిషన్ సభ్యుడు రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి

ఖమ్మం సింగరేణి ప్రతినిధి. (జన సంఘర్షణ)

వైరా నియోజకవర్గంలోని కారేపల్లి మండలం పాత కమలాపురం గ్రామానికి చెందిన



సర్పంచ్ తేజావత్ బాబురావు నాలుగు రోజుల క్రితం అకాల మరణం చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ నేపథ్యంలో ఈరోజు తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి, బాబురావు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, బాబురావు గ్రామాభివృద్ధికి చేసిన సేవలను స్మరించుకున్నారు. అలాగే మాజీ ఎంపీటీసీ రామ్‌రెడ్డి జగన్నాథ్‌రెడ్డి, కమలాపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా కార్యక్రమంలో పాల్గొని బాబురావు కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొని తేజావత్ బాబురావు మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

## మాజీ సొసైటీ చైర్మన్‌ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా

14.మార్చి..జన సంఘర్షణ ప్రతినిధి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో మాజీ సొసైటీ చైర్మన్ ఏలిన రాఘవరావుఇటీవలే సర్జరీ చేయించుకొని ఇంటి వద్ద(దమ్మపేట మండలం, నాచారంలో)విశ్రాంతి తీసుకుంటుండగా వారి ఆరోగ్య పరిస్థితిని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు అడిగి తెలుసుకొని పరామర్శించి త్వరగా కోలుకోవాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో చీకటి రామారావు, ఉప సర్పంచ్ శ్యామలి, పుల్లయ్య, మాద సుధాకర్ రావు, గుత్తి శ్రీనివాస్ రావు, బెతిని నాగేశ్వరరావు, కృష్ణమ చారి, దేరంగుల కృష్ణ, గుంజ నాగేంద్ర రావు, పాకనాటి శ్రీనివాస్ రావు, సత్యనారాయణ, బాబురావు తదితరులు ఉన్నారు.

## కానిపాకం వరసిద్ధిని సేవలో బాల బ్రహ్మానంద సరస్వతి

పూతలపట్టు కాణిపాకం మార్చి 14(జన సంఘర్షణ)

నైమిషారణ్య పీఠం హిందూ ధార్మిక సేవా సమితి వ్యవస్థాపకులు బాల బ్రహ్మానంద



సరస్వతి స్వామి శనివారం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. వీరు ఆలయంలో కళ్యాణ వేదిక నందు శ్రీ గణేశ పురాణం ప్రవచనాలను చేశారు, తరువాత స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



# అమ్మో దుమ్ము బయట రావాలంటే భయం

◆ **అక్రమ రవాణాకు అడ్డు లేదా?**



**వరదయ్యపాలెం (జన సంఘర్షణ):** మండలం కేంద్రంలోని సామాన్య ప్రజలు గ్రామస్తులు ప్రయాణికులు, వాహనదారులు బయటి రావాలంటే దుమ్మును చూసి భయపడుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం వాటర్ పైప్ లైన్ వేయడం కోసం రోడ్ సైడ్ కాలువలు తొవ్వి వాటర్ పైప్ లైన్ వేసిన విషయం అందరికి తెలిసిందే. అయితే రోడ్ సైడ్ కాలవలు పూడ్చిన మట్టి అలానే ఉండిపోవడం, భారీ వెహికల్స్ ఇసుక లారీలు చిప్స్ లారీలు పైన కనీసం పట్టగూడ కట్టుకోకుండా వెళ్లడంతో భారీగా దుమ్ము రావడం సామాన్యుల ప్రజలు చాలా తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటూ భారీ వెహికల్స్ వెళున్న సమయంలో వెనక బైకులో వెళ్లాలన్న కార్లు వెళ్లాలన్న సామాన్యులు చాలా ఇబ్బంది పడుతున్న విషయాన్ని పలుమార్లు స్థానిక అధికారులు దృష్టికి తీసుకెళ్లిన ఎవరు పట్టించుకున్న దాఖలు అయితే లేవు. దయచేసి ఇకనైనా ఉన్నత అధికారులు సామాన్యులు పట్ల నిర్లక్ష్యం వహించకుండా సామాన్యులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించి ఆ సమస్యని వెంటనే పరిష్కరించవలసిందిగా , క్వారీ నుండి కూడ భారీ వాహనాలు అధికాలోడు తో ఈ మార్గం ద్వారా రావడంతో సామాన్యులు కూడా ఇబ్బంధులకు గురి అవుతున్నారు. ఇప్పట్టిక్యనా సబంధిత అధికారులు చొరవ చూపాలని వేడుకుంటున్నారు.

# హెచ్‌పివి టీకాపై అవగాహన



**మనుబోలు. 14.3.2026 (జన సంఘర్షణ):** నెల్లూరు జిల్లాగూడూరు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హెచ్‌పివి టీకా (హ్యూమన్ పాపిల్లోమా వైరస్) టీకా కార్యక్రమం శనివారం గూడూరు మండలం, చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొన సాగుతోంది. చెన్నూరు పిహెచ్‌సి లో 14 సంవత్సరాల లోపు బాలికలకు టీకాలను కిషోర్ బాలికలకు వేస్తున్నారు.

అవగాహన మరియు ప్రయోజనాలు:ఈ సందర్భంగా యం.టి.హెచ్.ఎస్. నల్లిబోయిన మస్తానయ్య. ఏ.యన్.యం. సునీతా కుమారిమాట్లాడారు. భవిష్యత్తులో మహిళలకు వచ్చే గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఈ హెచ్.పి.వి. టీకా ఎంతో మేలు చేస్తుందని వివరించారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి బాలికకు ఈ టీకా అందేలా చూడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చెన్నూరు ఆరోగ్య కేంద్రం సిబ్బంది మస్తానయ్య, గడ్డం నాగేశ్వరరెడ్డి, ఏ.యన్‌యం. సునీతా కుమారి ఉమ.రత్న కుమారి, ఏ. రమణయ్య వాక్సీనేటర్, ఉష.సంపూర్ణమ్మ (ఎంపీహెచ్ ), ఉమ, అరుణ, వరప్రసాద్ (ఎంపీహెయో ) లతో పాటు ఆశా కార్యకర్తలు, ఏయన్‌యం లు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా జనసేనపార్టీ 13 వ ఆవిర్భావదినోత్సవం



**వరదయ్యపాళ్లెం (జన సంఘర్షణ):** మండలంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు వరదయ్య పాళెం మండలంలో ప్రతి గ్రామంలోను ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగలా జరుపుకుంటున్నామని అందులో భాగంగా మండల కేంద్రంలో అన్నదానం చేస్తున్నామని తెలియపరుస్తున్నాము. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ సత్తా చాటుతామని తెలిపారు. ఈ కార్యక్రమం లో నాయకులు మండల ఉపాధ్యక్షుడు తులసి, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, వినోద్, చెంగయ్య, పవన్, మునిరత్నం, తదితరులు పాల్గొన్నారు.

# విఆర్ కు బదిలీ అయిన శ్రీహరికోట ఎస్సై నాగబాబు




**సూళ్లూరుపేట( శ్రీహరికోట )మార్చి 14 (జన సంఘర్షణ):** శ్రీహరికోట పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ నాగబాబును విఆర్ కు బదిలీ చేస్తూ శనివారం తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి పరిపాలన కారణాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం ఎస్సై నాగబాబు తక్షణమే విధులు నుంచి రిలీఫ్ అయి ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలలో పేర్కొన్నారు. ఈ పరిణామం స్థానికంగా చేర్చినయసంగా మారింది.

# రైతుల కళ్లల్లో ఆనందమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం

◆ **హామీ మేరకు కొనసాగిస్తున్న అన్నదాత సుఖీభవ.**
◆ **రైతులకు చెంతకే నూతన టెక్నాలజీ.**
◆ **ధరల స్థిరీకరణతో రైతులకు అండగా కూటమి ప్రభుత్వం.**
◆ **24 గంటల్లో ధాన్యం సేకరణ రైతుల ఖాతాల్లో డబ్బులు.**
◆ **మాజీ శాసనమండలి సభ్యులు,రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి గౌని వారి శ్రీనివాసులు.**




**కుప్పం,మార్చ్ 14 (జన సంఘర్షణ):** రైతుల కళ్లలో ఆనందం చూడటమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం అని మాజీ శాసనమండలి సభ్యులు, మాజీ టీటీడీ పాలక మండలి సభ్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గౌని వారి శ్రీనివాసులు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' ద్వారా ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తూ దేశంలోనే అత్యధిక భరోసానిస్తోందన్నారు. తాజాగా 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,670 కోట్లను నేరుగా జమ చేసి కుటుంబ ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుందన్నారు. కేవలం ఆర్థిక సాయమే కాకుండా, డ్రోన్ సాంకేతికత, డ్రిప్ ఇరిగేషన్, 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' ఏర్పాటుతో వ్యవసాయాన్ని ఆధునీకరిస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టును వేగవంతం చేస్తూ, ధాన్యం సేకరణలో పారదర్శకత, ఆక్వా రైతులకు రాయితీ విద్యుత్ కల్పిస్తూ అన్నదాతల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. సంక్షేమం, సాంకేతికతలతో వ్యవసాయాన్ని సుస్థిరం చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగుతోందన్నారు.సూపర్ సిక్స్ ని కూటమి ప్రభుత్వం సూపర్ హిట్ చేసిందన్నారు.శుక్రవారం 'అన్నదాత-సుఖీభవ' మూడవ విడత నిధులు రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. కేంద్ర సహకారంతో అమలు అవుతున్న ఈ పథకం మూడో విడత నిధులను సూరంపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారన్నారు.

మూడవ విడతగా 46.85 లక్షల మందికి కేంద్ర, రాష్ట్ర వాటా కలిపి ఒక్కో రైతు అకౌంట్లో రూ.6,000 జమ చేశారన్నారు. మూడో విడతగా రూ.2,676 కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయన్నారు. ఇందులో రాష్ట్ర వాటా రూ.1,874 కోట్లు అని వివరించారు.ఇప్పటికే రెండు విడతల కలిపి రూ.14 వేలను ప్రభుత్వం అందించిందని, 2025 ఆగస్ట్ 2న మొదటి విడతగా రూ.7 వేల చొప్పున రూ.3,174 కోట్లు, నవంబర్ 19న రెండవ విడతగా రూ.7 వేల చొప్పున రూ.3,135 కోట్లు కలిపి రూ.6,309 కోట్లు రైతులకు అందించిందన్నారు. ఒక్క ఏడాదిలోనే రైతు సోదరులకు కూటమి ప్రభుత్వం రూ.8,985 కోట్లు అందించినట్లు అవుతుందన్నారు. ఇందులో రాష్ట్ర వాటా రూ.6,560 కోట్లు కాగా, కేంద్రం వాటా రూ.2,425 కోట్లుఅని ఆయన తెలిపారు. ధరల స్థితి కరణతో అండగా: ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు రూ.310 కోట్లు నష్టపరిహారం ఇవ్వడం జరిగిందన్నారు. గిట్టుబాటు ధర కోసం రూ.500 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశామన్నారు. మామిడి కూడా గిట్టుబాటు ధర రాక రైతులు ఇబ్బంది పడ్డారని,ప్రతి కేజీకి రూ.4 లు ఇచ్చామన్నారు. పొగాకు రైతులకు రూ.200 కోట్లకు పైగా సాయం అందించామన్నారు. ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేలు, టమాటా రైతులను, కోకో రైతులను ఆదుకున్నామన్నారు. రూ.1338 కోట్ల రూపాయలు నష్టపోయిన రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలిచిందన్నారు.గత పాలన వల్ల రాష్ట్రం అప్పుల సుడిగుండంలో నెట్టబడిందని విమర్శించారు. పెట్టుబడులు పెట్టేవారు కూడా రాలేదన్నారు. ఈ 20 నెలల్లో ఒక్కో అడుగు ముందుకు వేసుకుంటూ సమస్యలు పరిష్కరిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. ముందుకెళ్తున్నాం. 47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి 24 గంటల్లోనే రైతుల ఖాతాలో కూటమి ప్రభుత్వం డబ్బులు వేస్తూ ఉందన్నారు.

## ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో పాల్గొన్న... తలపా దామోదరం రెడ్డి

**శ్రీకాళహస్తి మార్చ్ 14 (జన సంఘర్షణ):** పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిళా రెడ్డి చేపట్టినటువంటి ఉపాధి హామీ పరిరక్షణ



యాత్ర రాష్ట్ర పర్యటనలో భాగంగా శనివారం అమలాపురం జిల్లా, పాయకారావుపేట నియోజకవర్గం, వెధర్లపాలెం నందు శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డిపాల్గొన్నారు.తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ వైయస్ షర్మిల రెడ్డి చేపట్టినటువంటి ఉపాధి హామీ పరిరక్షణ యాత్రకు ప్రజల నుంచి విశేషమైనటువంటి స్పందన వస్తుందని వారి పోరాట ఫలితంగానే నేటి ప్రభుత్వాలు తీసుకొచ్చినటువంటి కొత్త చట్టాలను మరో రెండు నెలలు వాయిదా పడిందని, నేడు కొనసాగుతున్నటువంటి ఉపాధి హామీ చట్టం ను కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారని, వైయస్ షర్మిల రెడ్డి చేపడుతున్నటువంటి సభలకు అశేష జనవాహిని తండోపతండాలుగా తరలివస్తున్నారని, రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ విజయం తధ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉంజల్ సేవలో కళ్యాణ వెంకన్న



**నారాయణ వనం మార్చి 14 (జన సంఘర్షణ):** మండల కేంద్రమైన నారాయణవనంలో వెలసిన ప్రముఖ ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం టిటిడి ఆలయమైన శ్రీ పద్మావతి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారికి ఘనంగా ఉంజల సేవ నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొల్పి, నిత్య పూజా కార్యక్రమాల అనంతరం 10 గంటలకు స్వామి అమ్మవార్లకు పాలు పెరుగు నెయ్యి కొబ్బరి నీళ్లు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. తర్వాత వివిధ పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిరోహించి ఆలయ ప్రాంగణంలో ఊరేగించి ఉంజల సేవ వేడుకగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి నాగరాజు, అర్జిత్ ఇన్స్పెక్టర్ భరత్, ఆలయ అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, ఆలయ సిబ్బంది, వాహన మోతగాళ్లు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు అండగా ఎన్డీయే కూటమి...టిడిపి నేతలు.

**శ్రీకాళహస్తి మార్చ్ 14 (జన సంఘర్షణ):** భారత ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పం కలిసి రాష్ట్ర రైతాంగానికి మేలు చేసే విధంగా పలు కార్యక్రమాలు చేపడుతున్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం... అన్నదాతలకు అండగా నిలుస్తున్నదని తెలుగుదేశం పార్టీ నాయకులు కొనియాడారు,గత ఎన్నికలలో రైతులకు ఇచ్చిన హామీని అమలు చేస్తూ నిన్నటి రోజు 'అన్నదాత సుఖీభవ.పీఎం కిసాన్' పథకంలో భాగంగా మూడో విడతగా అన్న దాతల ఖాతాలలో రూ.6000 లు జమతో రైతన్న కుటుంబాల్లో ఉగాది ఆనందం వెల్లివిరిసిందని, మూడో విడతగా రూ.6,000 జమతో సంవత్సరానికి రూ.20,000 ఆర్థిక సాయం పూర్తి చేసి కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవడం ఆనందదాయకం అని హర్షం వ్యక్తం చేస్తూ, శనివారం శ్రీకాళహస్తి పట్టణ పొలిమేరలో ఉన్న పంట పొలాల్లో నిల్చుని ప్రధాని, సియం, డిప్యూటీ సియం చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకం కింద 2025-26 సంవత్సరానికి రైతు సోదర సోదరీమణులకు మొత్తంగా రూ.8,985.41 కోట్లు అందుతున్నాయి.ఇందులో రాష్ట్ర వాటాగా రూ.6,560.18 కోట్లు, కేంద్ర వాటాగా రూ.2,425.23 కోట్లు అందుతున్నాయని తెలిపారు.గత వైసీపీ ప్రభుత్వ కాలంలో రాష్ట్రం నుంచి ఏడాదికి కేవలం రూ.7,500 మాత్రమే రైతులకు అందేదని, ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000లు



అందిస్తోందని, అంటే గతంతో పోలిస్తే రూ.6,500 ఎక్కువ సాయం అందుతోందని తెలిపారు.రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పలు సాగునీటి ప్రాజెక్టుల పనులు కూడా వేగవంతం అవుతున్నాయి. 2026 జూలై నాటికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని, అలాగే పోలవరం ప్రాజెక్టును 2027లో జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 'చేతల ప్రభుత్వం' మాత్రమే కాకుండా, 'మంచి ప్రభుత్వంగా' కూడా ప్రజల మన్ననలు పొందుతోందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డా.జి.దశరథాచారి, గాలి చలపతి నాయుడు, వన్నెకుల క్షత్రియ సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు యం.సుబ్బయ్య, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, బిసి విభాగం తిరుపతి పార్లమెంటు నాయకుడు తీర్థం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నాయుడుపేటలో ఘనంగా జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**నాయుడుపేట మార్చ్ 14 (జన సంఘర్షణ)**

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేటలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ వ్యవస్థాపకులు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు కొరకు జనసేన పార్టీని స్థాపించి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన నాయకులు, వీరమహిళలు, జనసైనికుల సూళ్లూరుపేట నియోజకవర్గ ఇంచార్జి నాయుడుపేట ఏఎంసి చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్. సమక్షంలో పార్టీ జండాని ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలని ఘనంగా జరిపారు. జనసేన శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న అనంతరం పార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి పార్టీలో తమ తమ అనుభవాల గురించి జనసేన నాయకులు, వీరమహిళలు, జనసైనికులు చర్చించుకున్నారు. పార్టీ స్థాపించిన రోజు నుండి నేటి వరకు పవన్ కళ్యాణ్ వెంట నడుస్తూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేసిన పవనన్న సైనికులందరికి ఉయ్యాల ప్రవీణ్ కృతజ్ఞతలు తెలియజేసారు. నన్ను నమ్మి నియోజకవర్గం బాధ్యతలు అప్పజెప్పి, నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించిన పవన్ కళ్యాణ్ నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నా కర్తవ్యం అని, ఆయన తీసుకున్న ఏ నిర్ణయమైన మనం అందరం పాటించాలని జనసేన శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నో అవమానాలు, కష్టాలు, ఓటమిని ఎదుర్కోని పవన్ కళ్యాణ్ పార్టీని నిలబెట్టి ఈరోజు కూటమిలో మనల్ని అధికారంలో భాగస్వాములు చేసారని, పార్టీ విలువలకి ఎవరు భంగం కలిగించకూడదని ఉయ్యాల ప్రవీణ్ జనసైనికులని కోరారు. సమావేశం అనంతరం జనసేన పార్టీ సీనియర్ నాయకులు అట్ల కృష్ణ రావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.



# నంద్యాలలో రెండు రోజుల టీవీ టెక్నీషియన్ శిక్షణా శిబిరం ప్రారంభం

- ఎస్.ఆర్.ఎం. విశ్వవిద్యాలయ సహకారంతో
- శిక్షణ శిబిరం ప్రారంభించిన డాక్టర్ రామకృష్ణారెడ్డి ,డాక్టర్ రవి కృష్ణ,
- టీవీ టెక్నీషియన్స్ సద్వినియోగం చేసుకోవాలి: మధుసూదన రెడ్డి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రానిక్, టీవీ టెక్నీషియన్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు
- నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ నిర్వహణలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న నిపుణులు సయ్యద్ ఇక్బాల్

**నంద్యాల మార్చి 14 (జన సంఘర్షణ)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రానిక్, టీవీ టెక్నీషియన్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో, అమరావతి ఎస్.ఆర్.ఎం. విశ్వవిద్యాలయ సహకారంతో,నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ నిర్వహణలో శనివారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల జిల్లా టివి టెక్నీషియన్లకు రెండు రోజుల సాంకేతిక శిక్షణా తరగతుల శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎలక్ట్రానిక్, టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న నిపుణులు సయ్యద్ ఇక్బాల్ అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజలను చేసి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ముందుగా టీవీ ని కనుగొన్న బైర్డ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ టీవీ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను తెలుసుకోవడం ద్వారా తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి టీవీ టెక్నీషియన్ కి ఇది గొప్ప అవకాశం అన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక నైపుణ్య శిక్షణ పొంది టీవీలు రిపేర్ కి వచ్చినప్పుడు లోపం ఎక్కడుందో సరిగా గుర్తించి, సత్వరమే తయారు చేసి ఇవ్వడం ద్వారా టెక్నీషియన్స్ పై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందన్నారు. టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ సభ్యుల కుటుంబాలకు మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహిస్తామని, వారి సంక్షేమానికి, అభివృద్ధికి స్థానిక మంత్రివర్యులు ఎన్.ఎం.డి.ఫరూక్ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ సహకారం అందేలా కృషి చేస్తామన్నారు. టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన రెడ్డి, నంద్యాల జిల్లా సంఘం అధ్యక్షులు కన్నయ్య మాట్లాడుతూ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ముందుగా కర్నూలు, నంద్యాల జిల్లాలలో ప్రారంభించడం సంతోషకరమన్నారు. శిక్షణ ఇస్తున్న సాంకేతిక నిపుణులు సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ టెలివిజన్ లు ఎప్పటికప్పుడు కొత్త సాంకేతికతతో రూపాంతరం చెందుతున్నాయని తదనుగుణంగా వాటి గురించి అవగాహన పెంచుకోవడం ప్రతి టీవీ టెక్నీషియన్ కి ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, శిక్షణ ఇస్తున్న సాంకేతిక నిపుణులు సయ్యద్ ఇక్బాల్, రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారి రామకృష్ణారెడ్డి, నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ సంఘం అధ్యక్షులు కన్నయ్య, నంద్యాల టౌన్ సంఘం అధ్యక్షులు జయపాల్, ఆడియో విజువల్ సాంకేతిక నిపుణులు వెంకటేశ్వర రెడ్డి, ఎస్.ఆర్.ఎం. విశ్వవిద్యాలయ ప్రతినిధి సాగర్, సందీప్, శివ యాదవ్, వీరా రెడ్డి, రహీమ్ బైగ్, ఎల్లా గౌడ్, జిల్లా నలుమూలల నుండి వచ్చిన రెండు వందల మంది పైగా టీవీ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

# సయ్యద్ మీరా మొహిద్దీన్ షా ఖాదరి మసీద్ లో ఇఫ్తార్ విందు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి

**నెల్లూరు జిల్లా (జన సంఘర్షణ)**

నెల్లూరు 48వ డివిజన్ మెక్లిన్స్ రోడ్డు లో సయ్యద్ మీరా మొహిద్దీన్ షా ఖాదరి మసీద్ లో ఇఫ్తార్ విందు కార్యక్రమానికి వైసిపి నెల్లూరు సిటీ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా సయ్యద్ మీరా మొహిద్దీన్ షా ఖాదరి దర్గా లో వైసిపి జిల్లా మైనారిటివిభాగం అధ్యక్షులు షేక్ సిద్దిఖ్, వైసిపి రాష్ట్ర మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్ లతో చంద్రశేఖర్ రెడ్డి దర్గాలో చేద్దర్ కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మీరా మొహిద్దీన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రత్యేకంగా దువా చేపట్టి అల్లా ఆశీస్సులు అందజేయడం ఆనంద నియమన్నారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ప్రతి ఒక్కరూ తనకు ఉన్న దానిలో కొంత దానధర్మాలు చేసి తోటి వారు కూడా సంతోషంగా ఉండాలని అనేక కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయం తెలిపారు. సర్వ మానవాళి శ్రేయస్సు ను కోరుతూ రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ప్రతి ఒక్కరూ ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలను ఆచరిస్తూ అల్లాను ప్రార్థించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో 16 డివిజన్ కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్ రెడ్డి, వైసిపి రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి చీదేళ్ల కిషన్, మైనార్టీ నేతలు యస్థాని, ఏఆర్‌బి రఫీ, మస్తాన్ భాయ్, ఆసీఫ్, ఆభీద్, ఇస్మాయిల్ డివిజన్ నేతలు ఆవుల నాగేంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఫిట్‌నెస్‌లో జాతీయ రికార్డు సృష్టించిన అభిరామ్...

**కేవీబీపురం- మార్చి 14 (జన సంఘర్షణ)**

కేవీబీపురం మండలం కళత్తూరు గ్రామానికి చెందిన యువకుడు కనపర్తి అభి రామ్ ఫిట్‌నెస్ రంగంలో దేశ స్థాయిలో రికార్డు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచాడు. ప్రముఖ వ్యాపారవేత్త కనపర్తి మధుసూదన రెడ్డి కుమారుడైన అభిరామ్ క్రమశిక్షణతో కూడిన సాధన, దృఢ సంకల్పంతో ఒకే విభాగంలో అద్భుత ప్రతిభను చాటాడు. 4 కిలోల డంబెల్స్‌తో నిర్వహించే ఫోర్ ఆర్మ్ రిస్ట్ రొటేషన్స్ విభాగంలో ఒక నిమిషంలోనే 85 రొటేషన్స్ పూర్తి చేసి ఇండియా స్థాయిలో రికార్డు నమోదు చేశాడు. అదే విభాగంలో ఫోర్ ఆర్మ్ ట్విస్ట్స్ కేటగిరీలో ఒక నిమిషంలో 170 ట్విస్ట్స్ పూర్తి చేసి మరో విశేష ఘనతను సాధించాడు. నిర్దిష్ట సాంకేతిక ప్రమాణాలు, అధికారిక పరిశీలనల అనంతరం ఈ ప్రయత్నాలు ధృవీకరించబడినట్లు నిర్వాహకులు తెలిపారు. క్రమబద్ధమైన సాధన, పట్టుదలతో అభిరామ్ జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటడం కళత్తూరు గ్రామానికి ప్రత్యేక గౌరవాన్ని తీసుకొచ్చింది. అభిరామ్ సాధించిన ఈ విజయంపై గ్రామ ప్రజలు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కుమారుడు దేశ స్థాయిలో రికార్డు సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందంతో ఉప్పొంగిపోతున్నారు. క్రమశిక్షణతో శ్రమిస్తే యువత ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలను చేరవచ్చని అభి రామ్ విజయమే ఉదాహరణగా నిలుస్తుందని పలువురు అభినందించారు.




# స్థానిక సమరానికి సన్నద్ధం కావాలి

- గుడిపల్లి టిడిపి అధ్యక్షులు సుబ్రమణి.



**కుప్పం,మార్చ్ 14 (జన సంఘర్షణ)**

త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని గుడిపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణి పిలుపునిచ్చారు. శనివారం గుడుపల్లి మండలం చిన్నగొల్లపల్లి పంచాయతీకి సంబంధించి రాళ్ల గంగమాంబ దేవాలయం దగ్గర సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మునిరత్నం, క్లస్టర్ ఇంచార్జి బేటప్ప నాయుడు, విండో చైర్మన్ రమేష్, కుప్పం నియోజకవర్గం ఐటీడీపి అధ్యక్షులు రామామూర్తి, మండల ప్రధాన కార్యదర్శి సురేష్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మురుగేష్, పంచాయతీ పార్టీ ప్రెసిడెంట్ అరుణాచలం, పంచాయతీ తెలుగు యువత ప్రెసిడెంట్ మణి, సర్పంచులు, బూత్ ఇంచార్జిలు, కో బూత్‌లు, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లాలో 8 మంది డిప్యూటీ తహసీల్దార్లకు ప్రమోషన్‌లు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



**కడప మార్చి 14 (జన సంఘర్షణ)**

కడప జిల్లాలో ఎనిమిది మంది డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా తాత్కాలిక ప్రమోషన్లు కల్పిస్తూ కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఆరుగురికి నందలూరు, చెన్నూరు, కడప అర్బన్, టి. సుండుపల్లి, మైలవరం, బి. కోడూరుల్లో పోస్టింగ్ ఇవ్వగా, ఒకరిని అన్నమయ్య జిల్లాకు కేటాయించారు. మరొక రి స్థానం ఇంకా ఖరారు కావాల్సి ఉంది. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలి కమైనవని స్పష్టం చేశారు.


# ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సౌజన్యంతో రంజాన్ తోఫా అందజేత



**నెల్లూరు జిల్లా- (జన సంఘర్షణ)**

నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల మౌజన్, ఇమామ్‌లకు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో అందించనున్న కానుక. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సౌజన్యంతో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రంజాన్ తోఫా కిట్లను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పంపిణీ చేశారు. శనివారం మాగుంట లే అవుట్‌లోని విపిఆర్ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నెల్లూరు సిటీ మరియు రూరల్ నియోజకవర్గాల పరిధిలోని మసీదులలో పనిచేస్తున్న ఇమామ్‌లు మరియు మౌజన్‌లు 'రంజాన్ తోఫా' అందుకున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పార్లమెంట్ సమావేశాల దృష్ట్యా ఢిల్లీలో ఉన్నందున ఆయన తరపున ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ముస్లిం మత పెద్దలకు గౌరవపూర్వకంగా రంజాన్ తోఫా కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో రంజాన్ తోఫా కిట్లు అందిస్తారని చెప్పారు. పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ముస్లిం సోదరులను గౌరవించి తోఫా అందజేసినందుకు ఇమామ్‌లు, మౌజన్‌లు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరం మరియు రూరల్ నియోజకవర్గాల పరిధిలోని వివిధ మసీదుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాణిపాకం వరసిద్ధిని సేవలో కేరళ కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు



**కాణిపాకంమార్చి 14(జన సంఘర్షణ)**

కాణిపాకం వినాయక స్వామిని శనివారం కేరళకర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు కేరళ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎం మనోజ్. కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈఎస్ ఇంద్రేష్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శనం ఏర్పాటు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన సూపర్డెంట్లు వాసు, కోదండపాణి, ఈ కార్యక్రమంలో టెంపుల్స్ ఇన్స్పెక్టర్ రవి, తదితరులు ఉన్నారు.

# ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ తోఫాలను పంపిణీ





**ఉప్పల్ జన సంఘర్షణ :**
రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉప్పల్లో ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఉప్పల్ కుతుబ్షాహీ పెద్ద మసీదులో నిర్వహించిన కార్యక్రమం లో ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి పాల్గొని తోఫాలను అందజేశారు.ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఖాజా మౌలానా ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కు రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రంజాన్ పర్వదినం సోదరభావం, శాంతి, సామరస్యాలకు ప్రతీకగా నిలుస్తుందని ఆమె పేర్కొ న్నారు.ఈ కార్యక్రమం లో డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్,ఈగ అంజయ్య ముదిరాజ్, బజార్ జగన్నాథ్ గౌడ్, తెల్కల మోహన్ రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవి రెడ్డి, బూసం రఘునాథ్ రెడ్డి, అస్లాం, అజ్జు, అల్లా భాషా, జలీల్, కాసిం, ఆసిఫ్, అన్వర్ పాషా, అఫ్జల్, ఇషాద్, సలీం, మినాజ్, నాగూర్ భాషా, ఖాజా, రసూల్ మొహమ్మద్, అష్రఫ్, మౌలాలి, జంగీర్ జబ్బార్, బజారు నవీన్ గౌడ్, రంగుల శేఖర్ ముదిరాజ్, జుబేద్, మోసిన్, వాయద్ తదితరులు పాల్గొన్నారు.అలాగే కుతుబ్షాహీ ఉప్పల్ పెద్ద మసీద్ కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

# ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**శంకరపట్నం జన సంఘర్షణ :**



మండల కేంద్రం కేశవపట్నంలో అంబేద్కర్ విగ్రహం సమీపంలో శనివారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని నాయకులు కేక్ కోసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని ఇటుక బట్టి కార్మికులకు అన్నదానం చేశారు. నాయకులు భూమా అనిల్ కుమార్, కంటె రాకేష్ గౌడ్ మాట్లాడుతూ 2014 మార్చి 14న ఆవిర్భవించిన జనసేన పార్టీ నేడు 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్నదని అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఆవిర్భవించిన పార్టీ మొదట్లో అపజయాలకు వెరవకుండా పేద ప్రజల సంక్షేమం,అభ్యున్నతి ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు సాగుతూ ఆంధ్రప్రదేశ్లోని గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమిలో భాగంగా అధికారంలోకి వచ్చింది. అవినీతి,అన్యాయాలు, అక్రమాలకు తావు లేకుండా.ప్రజా అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా జనసేన తెలంగాణలోనూ సేవా కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఇటీవలే జనసేనాని 33 కోట్ల టీటీడీ నిధులతో కొండగట్టు అంజన్న దేవాలయంలో మాల విరమణ మండప నిర్మాణానికి నిధులు వెచ్చించారని గుర్తు చేశారు. భారత చేగువేరా పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గడ్డి శ్రీనివాస్, సొల్లు రాకేష్, మార్క సంతోష్, మేకల మొగిలి, దొమ్మేటి శ్రీనివాస్, ఆరెపెల్లి అరవింద్, బక్కి అన్విత్ బాబు, పంజాల సాయి యశ్వంత్, సుంకరి కిషోర్, గుర్రం కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ఆధ్వర్యంలో కార్ల్ మార్క్స్ 143వ వర్ధంతి

**ఉప్పల్ జన సంఘర్షణ :**



ప్రపంచానికి సమానత్వ భావజా లాన్ని అందించిన మహా తత్త్వవేత్త, ఆర్థికవేత్త, సామాజిక మార్పుకు మార్గదర్శకుడైన కార్ల్ మార్క్స్ 143వ వర్ధంతి సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ ప్రాంతంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ వద్ద ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్క్స్ చిత్రప టానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్. బోస్, రాష్ట్ర సమితి సభ్యుడు జి. దామోదర్ రెడ్డి పాల్గొని మార్క్స్కు ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, మార్క్స్ మరణానంతరం కూడా ఆయన ప్రతిపాదించిన మార్క్సిజం సిద్ధాంతాలు ప్రపంచవ్యాప్తంగా అనేక విప్లవాలకు, సామాజిక మార్పులకు పునాదిగా నిలిచాయని పేర్కొన్నారు. శ్రామిక వర్గాల హక్కుల సాధన కోసం జరిగిన అనేక పోరాటాలకు మార్క్స్ ఆలోచనలు ప్రేరణగా నిలిచాయని తెలిపారు.కష్టాల కొలిమిలో కాలిన జీవితాన్ని గడిపినా శ్రామిక శ్రమజీవుల చైతన్యమే తన ధ్యేయంగా పెట్టుకుని సమానత్వం, సామాజిక న్యాయం, దోపిడీ రహిత సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహా మేధావి మార్క్స్ అని కొనియాడారు. ప్రపంచ ప్రఖ్యాత తత్త్వవేత్తగా, ఆర్థికవేత్తగా, సామాజికవేత్తగా ఆయన ఆలోచనలు నేటికీ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు దారి చూపుతున్నాయని తెలిపారు. కమ్యూనిస్టు భావజాలానికి పితామహుడైన ఆ మహనీయుని వర్ధంతి సందర్భంగా విప్లవ జోహార్లు అర్పిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా యువజన సమాఖ్య మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, ఆల్ ఇండియా విద్యార్థి సమాఖ్య ఉప్పల్ నియోజకవర్గ నాయకుడు వికాస్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ నాయకులు విజయ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# బెట్టింగ్ యాప్స్కు వ్యతిరేకంగా యువత పోరాడాలి

**బీపీఎల్ టోర్నమెంట్ మూడవ రోజుకు హాజరైన మహిళా నేతలు**

**సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఛాయా దేవి**



**ఉప్పల్ జన సంఘర్షణ :**
బెట్టింగ్ యాప్స్కు వ్యతిరేకంగా యువత పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఛాయా దేవి.పిలుపునిచ్చారు.ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ సీ గ్రౌండ్స్ లో 12నుండి 17వరకు నిర్వహిస్తున్న భగత్ సింగ్ ప్రీమియర్ లీగ్(బీపీఎల్) టోర్నీ మూడవ రోజు ఛాయా దేవి ముఖ్య అతిథిగా హాజరై, క్రీడాకారులతో కరచాలనం చేసి ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఛాయా దేవి మాట్లాడుతూ యువతలో పెరుగుతున్న ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రభావంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. క్రీడలు యువతను ఆరోగ్యకరమైన జీవన విధానానికి, క్రమశిక్షణకు, సమాజానికి ఉపయోగపడే మార్గంలో నడిపిస్తాయని అన్నారు. అయితే ప్రస్తుతం కొన్ని ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ యువతను మోసం చేస్తూ, త్వరగా డబ్బు సంపాదించాలనే తప్పుడు ఆశలు చూపిస్తూ వారి భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని విమర్శించారు. క్రికెట్ వంటి క్రీడలను ప్రోత్సహించే పేరుతో బెట్టింగ్ సంస్కృతి పెంచడం సమాజానికి ప్రమాదకరం అని వారు పేర్కొన్నారు. యువత ఈ మోసపూరిత యాప్స్కు దూరంగా ఉండాలని, తమ సమయాన్ని క్రీడలు, విద్య, సామాజిక బాధ్యతల కోసం వినియోగించాలని పిలుపునిచ్చారు.భగత్ సింగ్ ను స్ఫూర్తిగా తీసుకుని యువత అన్యాయాలకు, దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా నిలబడాలని మహిళా సమాఖ్య నేతలు అన్నారు. ప్రభుత్వాలు కూడా ఇలాంటి బెట్టింగ్ యాప్స్పై కఠిన చర్యలు తీసుకొని యువతను రక్షించాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా టోర్నమెంట్లో పాల్గొన్న క్రీడాకారులను మహిళా సమాఖ్య నాయకులు అభినందిస్తూ, ఇలాంటి క్రీడా కార్యక్రమాలు యువతలో సానుకూల ఆలోచనలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా ఫోరమ్ రాష్ట్ర నాయకురాలు ప్రేమ్ పావని, ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్,సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్,జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్,భగత్ సింగ్, మహేష్,ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు అనీల్ కుమార్, భాను లతో పాటు 10 టీమ్ ల క్రీడాకారులు పాల్గొన్నారు.

# ప్రణాళికబద్ధ ఆలోచనతోనే అభివృద్ధి

-హక్కుల కోసం ఐక్య పోరాటం

-రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుని కర్తవ్యం

-మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం ప్రజావారధి :**
స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రణాళికబద్ధంగా ఆలోచన చేసి నిధులను సాధించగలిగితే -త్వరితగతిన అభివృద్ధి సాధ్యపడుతుందని తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ హక్కులు, నిధుల కోసం పోరాడాలని ఆయన సూచించారు. పాల్వంచ సుగుణా గార్డెన్స్లో సిపిఐ రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధుల శిక్షణా శిబిరంలో భాగంగా -శనివారం భారత రాజ్యాంగం స్థానిక సంస్థలు అభివృద్ధి, ప్రజాప్రతినిధులు నిధులు, విధులు అనే అంశంపై బోధించారు. భారతదేశ పౌరులుగా ఉన్న ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగానికి లోబడి పని చేయాలని రాజ్యాంగం గురించి తెలుసుకోవాలని భారత రాజ్యాంగంలో అందరికీ సమానమైన హక్కులు కేటాయించబడ్డాయన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత స్థానిక ప్రభుత్వాల విషయంలో కొంత నిర్లక్ష్యం ఉండేదని 73, 74 రాజ్యాంగ సవరణ తర్వాత తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహిస్తేనే నిధులు కేటాయించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉదాహరణకు తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు సకాలంలో నిర్వహించకపోవడంతో కేంద్రం నిధులు నిలిపివేసిందని -పంచాయతీ ఎన్నికలు జరిగిన తర్వాత ఇప్పుడు నిధులు విడుదల చేసిందని శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామ -పంచాయతీలకు 90 శాతం నిధులు జనాభా ప్రతిపాదికన పది శాతం నిధులు వైశాల్యం ప్రతిపాదికన కేటాయించబడతాయన్నారు. నిధులు కేటాయింపులో ఎటువంటి వివక్షత ఉండదన్నారు. గ్రామ పంచాయతీ లేదా మున్సిపల్, కార్పోరేషన్ ప్రతినిధులు ముందుగా తమ విధులు, బాధ్యతలను గుర్తెరగాలని ఆయన సూచించారు. అధికారాన్ని గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలని సిపిఐ ప్రజాప్రతినిధులు మంచిని ప్రోత్సహిస్తూ అభివృద్ధి పదంలో నడిపించినప్పుడే పార్టీకి గుర్తింపు లభిస్తుందన్నారు. భారత రాజ్యాంగంలో కొన్ని అంశాలు మార్చలేనివి ఉన్నాయని ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద, సమానత్వ, గణతంత్ర విధానాన్ని మార్చే ప్రసక్తే లేదని ఆయన -తెలిపారు. భారత రాజ్యాంగం గురించి, దేశభక్తి గురించి మాట్లాడుతున్న బిజెపి లేదా దాని అనుబంధ ఆర్ఎస్ఎస్ మొదలైనవి రాజ్యాంగం అమల్లోకి వచ్చిననాడు తమ పత్రిక ఆర్గనైజర్లో దేశానికి ఇక దుర్దినమని ప్రకటించారని రాజ్యాంగం ఆమోదం పొందిన తర్వాత ఇక చీకటి రోజులంటూ వార్తలు ప్రచురించడంతో పాటు జాతీయ జెండాను -ఏనాడు ఆర్ఎస్ఎస్ ఇతర బిజెపి అనుబంధ సంస్థలు గౌరవించలేదన్నారు. నాగపూర్లోని బిజెపి కేంద్ర కార్యాలయంలో బిజెపి అధికారంలోకి వచ్చేంత వరకు జాతీయ జెండాను ఆవిష్కరించలేదని శ్రీనివాసరెడ్డి తెలిపారు.గతంలో జాతీయ జెండా మార్పు ఇతర అంశాలకు సంబంధించి అనేక అనాధికార తీర్మానాలను ప్రవేశపెట్టారని ఇప్పుడు 460 సీట్లు అడుగుతున్నది కూడా రాజ్యాంగాన్ని మార్చడానికేనని ఆయన అన్నారు. ప్రజలకు అనుకూలంగా చట్టాలు చేయడం తప్పు కాదని ఆయన తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించడం ద్వారా అణగారిన వర్గాలు రాజ్యాంగం ద్వారా పొందిన హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. బడ్జెట్పై ఆయన -మాట్లాడుతూ మోసపూరిత లెక్కలు ప్రజా జీవితాలను ఛిద్రం చేస్తున్నాయని తలసరి ఆదాయం పెంపు కూడా ఇబ్బందికరమేనన్నారు. తెలంగాణలో సైతం పదివేల కోట్ల పైబడిన సంపన్నులు తయారయ్యారని ఆయన తెలిపారు. దేశ పౌరులుగా హక్కుల కోసం పోరాడటంతో పాటు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఆర్టిఐ మాజీ కమిషనర్ ప్రొ॥ మాడబూసి శ్రీధర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు ప్రజాసేవకులన్నారు. -పార్లమెంటు, శాసనసభల మాదిరి గ్రామసభకు కూడా ఒక బాధ్యతాయుత గౌరవం ఉందని ఆయన తెలిపారు. సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. భారత రాజ్యాంగంలో ఉన్న ఫెడరల్ -వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, అక్కినేని వనజ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండి సురేష్, ఎస్కె సాబీర్ పాషా, జమ్ముల జితేందర్రెడ్డి, ముత్యాల -విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వర్లు, భిక్షపతి, కొత్తగూడెం మేయర్ మూడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట యోధురాల త్యాగాలు గుర్తింపు ఏది

**అమరుల స్మృతి వనం ఏర్పాటుకు సిఎం రెవంత్ రెడ్డి కృషి చేయాలి**

**సిపిఐ సినియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి.**

**సిద్దిపేట ప్రజావారధి :**
తెలంగాణ సాయుధ పోరాటంతో నైజాం సర్కార్ తో పోరాడి పేదలకు విముక్తి చేసి రాజాకార్ల తుపాకి తూటాలకు బలైపోయిన అనభేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతి రెడ్డి మరో 10 మంది పోరాట యోధురాల నెలకొరిగి నేటి 78 ఏండ్లు గడుస్తున్నా తెలంగాణ సాయుధ పోరాట యోధురాలకు గత పాలకుల వైఖరి మూలంగా తగిన గుర్తింపు రాలేదని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రెవంత్ రెడ్డి ప్రజా పాలనలో తగిన గుర్తింపు, అమరవీరుల స్మృతి వనం ఏర్పాటుకు చేసి అమరవీరుల కుటుంబాలకు తగిన గుర్తింపు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి కృషి చేయాలని సిపిఐ సినియర్ నాయకులు మాజీ తెలంగాణ అమరవీరుల ట్రస్టు చైర్మన్ చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం నాడు మహ్మదపూర్ గ్రామంలో అమరవీరుల స్మారక స్థూపం పూలమాలువేసి ఘనంగా నివాళులు అర్పించి ఎర్రజెండా ఎగురవేశారు.అనంత భూషణ గట్లల్లో అసువులు బాసిన సమరయోధుల సమాధుల వద్ద అలాగే మహ్మదపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పిట్టల వెంకన్న 41వద్ద సందర్భంగా పూల మాలలు వేసి శ్రద్దాంజలి ఘటించారు.అనంతరం చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ అనాడు భూమి భుక్తి విముక్తి కోసం పోరాటం చేసిన వీరయోధుల ఫలితంగానే నేడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని ఆనాటి త్యాగధనులు సిపిఐ చేసిన పోరాటల ఫలితంగానే తెలంగాణలో లక్షలాది ఎకరాల భూమిని పొందిన చరిత్ర వుందని ఎర్రజెండా నాయకులు వివిధ పార్టీలుగా విడిపోవడం వల్ల దేశంలో నేడు పేదలకు సంక్షేమ పథకాలు అందడం లేదని ఎర్రజెండాలు ఏకం కావాలని చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. నేడు సంక్షేమ పథకాలు ఇవ్వండని ప్రజలు అడుక్కునే దుస్తితి సరికాదని పాలకులు అధికారులు అర్హులైన వారికి ఫింఛడ్లు పక్క ఇండ్లు రేషన్ కార్డులు ఇవ్వాలని చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఏప్రిల్ లో గడప గడపకు సిపిఐ పేరుతో సమస్యలు లేవనేత్తి ప్రజా పోరాటాలకు సిపిఐ శ్రేణులు సిద్ధం కావాలని చాడ వెంకటరెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సిపిఐ కార్యదర్శి పంజాల శ్రీనివాస్, హుస్నాబాద్ నియోజకవర్గ సిపిఐ కన్వీనర్ జాగీర్ సత్య నారాయణ,దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, చిగురుమామిడి మాజీ జడ్పీటీసీ సభ్యులు అందే స్వామి,సిద్దిపేట జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్,జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్, అనభేరి కుటుంబ సభ్యులు తుల వాసంతి మధుసుధన్ రావు,తుల శ్రీదేవి సుధాకర్ రావు,జంగల్ కరుణ, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజివరెడ్డి,గూడ పద్మ, జనగాం రాజ్ కుమార్,పొదిల కూమరస్వామి,నియోజకవర్గ నాయకులు బత్తుల బాబు, బొనగిరి శంకర్ గ్రామ శాఖ కార్యదర్శి పిట్టల మెగిలయ్య,మాజీ ఎంపిటిసి సభ్యులు పిట్టల సుధాకర్,సిపిఐ మండల అయిలేని మల్లారెడ్డి,పిట్టల ప్రసాద్,మౌటం బాలయ్య,పిట్టల బాలయ్య,జంగ విజయ, దొంతరవేని రంజిత్ ఎఐవైఎఫ్ నాయకులు వెల్పుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
ఆదివారం
15 మార్చి 2026

## సావిత్రిబాయి పూలే నేషనల్ అవార్డుకు ఎంపికైన ఇల్లందుల శారద

**జగిత్యాల జనసంఘర్షణ :**



సావిత్రిబాయి పూలే నేషనల్ అవార్డు 2026 గాను ఉపాధ్యాయురాలు ఇల్లందుల శారద ఎంపికైనట్లు జాతీయ అవార్డు కమిటీ గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా అవార్డు సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్ మరియు బిఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాదులోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా నల్ల రాధాకృష్ణ మాట్లాడుతూ ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతి ఏటా ప్రజా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు రచయితలకు కవులకు మరియు స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం మార్చి 15వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ లోని తిరుపతిలో నిర్వహించే బహుజన సాహిత్య అకాడమీ 18వ నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగా ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలియజేశారు. సౌత్ ఇండియాలోని ఆరు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, బీఎస్ఏ పుదిచెర్రి రాష్ట్రాల నుండి సుమారుగా 600 మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్స్ లో హాజరవుతారని తెలియజేశారు.

## పాత్రికేయుడు యాదగిరికి అందెశ్రీ పురస్కారం

**జనసంఘర్షణ సిద్దిపేట:**



సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కేశవపూర్ గ్రామానికి చెందిన కవి రచయిత సీనియర్ పాత్రికేయులు జోనగోని యాదగిరికి సిదిపేట ప్రెస్ క్లబ్లో వెన్నెల సాహితీ సంఘం ఆధ్వర్యంలో అందెశ్రీ ఉగాది పురస్కారం అందజేయడం జరిగింది అవార్డు రావడం చాలా సంతోషమని భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమం నిర్వహిస్తానని యాదగిరి తెలిపారు

## జనం మన్ననలు పొంద గలిగిన వారే నిజమైన నాయకులు

- కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకం కావాలి
- సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలి
- ఎంఎల్ఏ కూనంనేని

**కొత్తగూడెం జనసంఘర్షణ :**

జనం మన్ననలు పొందగలిగిన వారే నిజమైన నాయకులు అని, కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు అనునిత్యం ప్రజలతో మమేకం కావాలిని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ ఆధ్వర్యంలో గెలుపొందిన ప్రజాప్రతినిధులకు పాల్వంచలోని సుగుణ గార్డెన్స్లో జరుగుతున్న రెండో రోజు శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టు నాయకులకు పదవుల కంటే ప్రజలే ముఖ్యమని, ఆ పదవులే కావాలనుకుంటే జ్యోతిబసు లాంటి కమ్యూనిస్టు యోధులు ఏ నాడో ప్రధాని అయ్యేవారని తెలిపారు. చంద్రా రాజేశ్వరరావు లాంటి నేత పార్టీ నిర్మాణానికి, ప్రజాపోరాటలకే ప్రాధాన్యత ఇస్తూ ఎమ్మెల్సీ పదవిని తృణప్రాయంగా భావించి రాజీనామా చేశారని తెలిపారు. కమ్యూనిస్టు నేతలెవ్వరూ ఆడంబరాలకు పోకుండా సామాన్య ప్రజా జీవితాన్ని గడిపారని, పుచ్చలపల్లి సందరయ్య వంటి నాయకులు సైకిల్ పై పార్లమెంట్కు వెళ్లారని,ఐదు సార్లు ఎమ్మెల్యే గా గెలిచిన గుమ్మడి నర్సయ్య సాదా సీదా జీవనాన్ని సాగిస్తున్నారని, రజబ్ అలీ వంటి మేధావులు కమ్యూనిజమే ఊపిరిగా బ్రతికారని చెప్పారు. వీరంతా ప్రజాసేవలో ఆదర్శమూర్తులని చెప్పారు. వీళ్లందరితో పోల్చుకుంటే మనం చాలా తక్కువని, స్వార్ధ ప్రయోజాలకు తావులేని ప్రజాసేవకు అంకితం కావాలన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు పార్టీలో ప్రజాప్రతి




నిధులుగా ఎన్నికై ప్రజా సేవ చేసేందుకు ముందుకు రావడం గొప్ప విషయమని, నిబద్ధతతో పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలన్నారు. కమ్యూనిస్టు నాయకునిగా ఉంటే ఆ విలువే వేరని, అన్యాయం రాజ్యమేలుతున్నప్పుడు ప్రజల కమ్యూనిస్టులను కోరుకుంటారని కమ్యూనిస్టుల దగ్గరకు వెళితే సమస్యలు తీరుతాయనే నమ్మకం ప్రజల్లో ఉందని, దానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. ప్రతీ రోజు ప్రజాప్రతినిధులు వారివారి వార్డుల్లో, డివిజన్లలో తిరగాలాని, ఆత్మీయానుబంధాలు పెంచుకోవాలని, సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మన ప్రాంతంలోనే కాకుండా జిల్లా నలుమూలల, రాష్ట్ర వ్యాప్తంగా, దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు వార్తా పత్రికలు చదవాలని, పుస్తక పఠనం అలవర్చుకోవాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. కొందరు కమ్యూనిస్టులపై అవాకులు చెవాకులు పేలుతున్నారని, సీట్ల సర్దుబాటు సమస్య కారణంగా విడివిడిగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాల్సి వచ్చిందని, ఆ సమయంలో కూడా మనస్సుకు గాయం అయ్యేలా కొందరు ఇష్టాను సారంగా మాట్లాడారని, ఆ కసితో గ్రామ పంచాయితీ ఎన్నికల్లో పనిచేశామని, వారి కంటే మూడు వేల ఓట్లు అత్యధికంగా నియోజకవర్గంలోని గ్రామపంచాయితీల్లో పోలయ్యాయని చెప్పారు. కార్పొరేషన్ ఎన్నికల్లో సైతం ఇదే తతంగం సాగిందని, దీనిని కూడా నవాల్ గా తీసుకుని కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో విజయ ఢంకా మోగించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నామని తెలిపారు. అహంభావం పతనానిక దారి తీస్తుందని , ప్రజల కోసం నిస్వార్ధ జీవితం గడిపిన వారు చరిత్రలో నిలిచిపోతారని, తాత్విక ఆలోచనలతో ముందుకు సాగాలని కూనంనేని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి, సర్పంచ్ సుజన్ అ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మీడియా అకాడమి చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, బేజవాడ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, కర్రి బిక్షపతి, అజయ్ సారధి, మూడ్ గణేష్లు పాల్గొనగా మునిగడప పద్మ, ఉమా వాసిరెడ్డి మురళీ స్టీరింగ్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

## గోకవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రౌతు పండు అకాల మరణం

వైద్య విద్యార్థుల కొరకు జిఎస్ఎల్ మెడికల్ కళాశాలకు పార్థివ దేహం దానం
ప్రెస్ క్లబ్ రూపకర్త మరణంతో శోకసముద్రంలో డి.గోకవరంప్రెస్ క్లబ్

**గోకవరం జనసంఘర్షణ :**

గోకవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రౌతుపండు అకాల మరణం పొందారు. కుటుంబ సభ్యులతో పాటు, గోకవరం ప్రెస్ క్లబ్ సభ్యులు శోక సముద్రంలో మునిగారు. శుక్రవారం రాత్రి ఆయన గుండెపోటుతో కన్నుమూశారు. పదిమందికి ఉపయోగపడాలనే తపన,సామాజిక స్పృహ కలిగిన పండు తాను మరణించినా తన ఆలోచనలను సజీవంగా ఉండేటట్టు చారిత్రకమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తన మరణానంతరం వైద్య విద్యార్థుల పరిశోధన కోసం జిఎస్ఎల్ మెడికల్ కాలేజ్ కి అప్పగించాలని గతంలో కోరారు. ఆయన చివరి కోరిక మేరకు పండు భౌతిక కాయాన్ని రాజానగరం జిఎస్ఎల్ మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు, ప్రెస్ క్లబ్ వారు తరలించారు. తన



ఆశయాన్ని పలువురు ప్రశంసించారు. 20 సంవత్సరాల సుదీర్ఘంగా పత్రికా రంగంలో సేవలు అందించిన పండు గోకవరంలో ప్రెస్ క్లబ్ స్థాపనకు ఎనలేని కృషి చేశారు. కొంతమంది సభ్యులను కలుపుకొని ప్రెస్ క్లబ్ రూపకల్పనతో పాటు, తన ఆలోచనలను ప్రగతి పదంలో నడిపించారు. ఆయన అకాల మరణంతో పండు కుటుంబ సభ్యులకే కాకుండా, గోకవరం ప్రెస్ క్లబ్ పెద్ద దిక్కును కోల్పోవడం జరిగింది. పండు పార్థివ దేహాన్ని చూసేందుకు వందలాదిగా ఆయన స్వగృహానికి జనం వచ్చారు. జగ్గంపేట మాజీ శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు, గోకవరం సొసైటీ అధ్యక్షులు గాజింగం సత్తిబాబు, మాజీ సొసైటీ అధ్యక్షులు దాసరి తమ్మన దొర,



మాజీ జెడ్పిటిసి వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుల్లా ఏడుకొండలు తదితరులు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. పండు అకాలమరణం ప్రెస్ క్లబ్ కు తీరని లోటని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కర్రి శివ రామకృష్ణ భావోద్వేగానికి గురయ్యారు.

## సుజాతనగర్ మండల కేంద్రంలోని పత్తి కేంద్రాన్ని వెంటనే తొలగించాలి

**గ్రామస్తులు కాలనీవాసులు**

**సుజాతనగర్/ జనసంఘర్షణ :**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ లో ప్రధాన రహదారికి ఆనుకొని ప్రతి కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా కేంద్రానికి ఆనుకొని ఉన్న గృహస్తులు అనారోగ్యానికి గురవుతున్నారు. హాస్పిటల్ చుట్టూ తిరిగి వేలకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ అనారోగ్యానికి కారణం పత్తి నుంచి వచ్చే దుమ్ము ధూళి హానికరకమైన క్రిములతో రోగాలు పాలవుతున్నారని డాక్టర్లు తెలిపారు. ఎన్నిసార్లు కొనుగోలు కేంద్ర యజమానులకు చెప్పినా కానీ మాకు అన్ని అనుమతులు ఉన్నాయంటూ ఘాటు సమాధానం చెప్పుకుంటూ వస్తున్నారు. వెంటనే అధికారులు ఈ పత్తి కొనుగోలు కేంద్రాన్ని తొలగించాలి. అంటూ శుక్రవారం సుజాత నగర్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి కి వినతిపత్రం అందించారు. తక్షణమే పత్తి కొనుగోలు కేంద్ర యజమానులతో మాట్లాడి కేంద్రాన్ని జనావాసాలకు దూరంగా నిర్మించుకోవాలని తెలిపారు. రాబోవు రోజుల్లో కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తామని సుజాతనగర్ గ్రామస్తులు తెలిపారు.

## మండల కేంద్రంలో ప్రశాంతంగా పదవ తరగతి పరిక్షలు ప్రారంభం

**అన్నపరెడ్డిపల్లి/ జనసంఘర్షణ**



అన్నపరెడ్డిపల్లి మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరిగింది. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. 14 3 2026 నూండి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఈ మండలంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాలలో అరగంట ముందుగానే పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించారు. ఎగ్జామ్ సెంటర్?లో అధికారులు మౌలిక వసతులు ఏర్పాటు చేశారు.పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

విలేకరులు కావలేను



తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
జన సంఘర్షణ దిన పత్రికలో పనిచేయుటకు
జిల్లాల వ్యాప్తంగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గల
వారికి ఆర్.సి. ఇంచార్జీలు, మండల స్థాయి రిపోర్టర్లుగా
పనిచేయుటకు అసాక్తి, ఉత్సహం కలిగిన యువతి,
యువకులు కావలేను. సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును
వివరాలకు సంప్రదించండి 63050 26524

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co